J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 17.04.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 46 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## మే 3 దాకా...
# తాళం తీసేదే లేదు



- ఇప్పటికి కరోనాపై పాక్షిక విజయమే
- లాక్‌డౌన్ ఎత్తేస్తే వైరస్ విజృంభించే అవకాశం
- లాక్‌డౌన్ పొడిగింపుకే అన్ని రాష్ట్రాల మొగ్గు
- మరికొన్నిరోజులు ఇల్లే ఇండియా అన్న ప్రధాని

*కరోనాపై పోరాటంలో మొదటి ఇన్నింగ్స్ ముగిసింది. ఈనెల 14వతేదీతో 21రోజుల లాక్‌డౌన్ ముగిసింది. మార్చి 24వతేదీ నుండి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన లాక్‌డౌన్ ఎంతో విజయవంతంగా కొనసాగింది. కోట్లాదిమంది ప్రజలు ఇళ్లకే పరిమితమై కరోనాపై భారత్ చేస్తున్న పోరుకు తమ సంపూర్ణమద్దతు పలికారు.* (మిగతా 11వ పేజీలో)

# పెరిగేనా? ఆగేనా?

- చాపక్రింద నీరులా విస్తరిస్తున్న వైరస్
- ప్రమాదకరంగా గుంటూరు, కర్నూలు, నెల్లూరు జిల్లాలు
- టెస్టులలో వేగం పెంచిన ప్రభుత్వం

కరోనా వైరస్ ఆంధ్రప్రదేశ్‌లోనూ చాపక్రింద నీరులా విస్తరిస్తూనే వుంది. మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో కేసుల నమోదు తక్కువుగానే వున్నప్పటికీ, ఆయా జిల్లాల్లోని కొత్త ప్రాంతాలలో కేసులు బయటపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. (మిగతా 11వ పేజీలో)



## కరోనా వ్యాక్సిన్..
# మన చేతుల్లోనే ఉంది

లాయర్ కోసం ప్రత్యేక వ్యాసం



కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి,
వ్యవస్థాపక ఛైర్మన్, శాంతా బయోటెక్నిక్స్ లి.

***కరోనా పేరుతో ప్రసిద్ధి కెక్కిన కోవిడ్ 19 అంటువ్యాధి ప్రబలగానే నాపై ఒత్తిడి పెరిగింది. హెపటైటిస్-బి అనే కాలేయవ్యాధికి అత్యాధునికమైన, క్షేమదాయక బయోటెక్ వ్యాక్సిన్‌ను స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధిపరచి, హైదరాబాదులో శాంతా కర్మాగారంలో ఉత్పత్తి చేసి, 'శాన్‌వాక్-బి'ని సామాన్యుడికి అందుబాటు ధరలో తెచ్చి, ఆ వ్యాధి గురించి అందరికీ అవగాహన పెంచి, ఆ వ్యాక్సిన్ వాడకాన్ని వేలరెట్లు పెరిగేందుకు మా సంస్థ ద్వారా దోహద పడే అవకాశం నాకు దక్కింది. అందుకే యీ కొత్త వ్యాధి పేరు వినగానే అందరూ నా వైపు చూశారు. శాంతా బయోటెక్ ప్రస్థానం 'శాన్‌వాక్'తో ఆగిపోకుండా కలరాతో సహా అనేక రకాల అంటువ్యాధులకు వ్యాక్సిన్‌లను, ఔషధాలను తయారుచేస్తూ జాతీయ, అంతర్జాతీయ అవార్డులు గెలుచుకుని, దేశంలో బయోఫార్మా విప్లవానికి నాంది పలకడంతో ఈ అంటువ్యాధికి కూడా మేం వ్యాక్సిన్ కనిపెట్టేసి వుంటామని చాలా మంది అనుకున్నారు.***

కొందరు ఛానెల్స్ వారు 'ఎప్పుడండీ కరోనా వ్యాక్సిన్?' అని అడగ నారంభించారు. 'ఇప్పుడే కదా ఆ రోగక్రిమి బయటపడి దాని స్వరూపస్వభావాలను అధ్యయనం చేస్తున్నారు. అప్పుడే ఎక్కడ వాక్సిన్?' అని నేనంటే 'లక్షలాదిమందికి అది మహమ్మారిలా వ్యాపిస్తూ వుంటే, ప్రపంచమంతా గజగజా వణుకుతూంటే, అందరూ అన్ని పనులూ మానుకుని ఇళ్లల్లో తలుపులు మూసుకుని కూర్చోవలసిన పరిస్థితి వచ్చింది కాబట్టి ఆతృతగా అడుగుతున్నామంటూనే ఖరీదు గురించి కూడా ఆరా తీశారు.

## ఆ వాక్సిన్ ఇప్పట్లో రాదు..

మీలో కొందరికైనా ఇలాంటి సందేహం మెదులుతూ వుంటుందనే ఉద్దేశంతో ముందే చెప్పేస్తున్నా - వాక్సిన్ తయారీ తేలికైన, త్వరగా తెమిలిపోయే వ్యవహారం కాదు. వ్యాధి వచ్చాక తగ్గేందుకు ముందుగా ఔషధాన్ని కనిపెడతారు. తర్వాతి మెట్టుగా అసలు రోగం రాకుండా నివారించడానికి వాక్సిన్ తయారు చేస్తారు. అన్నిటికంటే ముందు ఆ రోగం ఎలా వస్తుందో తెలుసుకోవాలి. దానికి కారకమైన క్రిమి జన్యుక్రమం ఏమిటి? దాని లక్షణాలేమిటి, ఏ పరిస్థితుల్లో పెచ్చరిల్లుతుంది, ఎలాంటి చర్యల వలన నివృత్తి చెందుతుంది.. ఇలాంటివన్నీ పరిశీలించి, పరీక్షించి తెలుసుకున్నాకనే ఔషధం తయారుచేస్తారు. తయారుచేశాక జంతువులపై, మనుష్యులపై ప్రయోగించి చూసి, ఏ వయసువారికి ఏ మోతాదులో, ఎన్నాళ్లు వాడితే పనిచేస్తుందో నిర్ధారిస్తారు.

ఔషధ పటిమ నిల్వకాలం ('షెల్ఫ్‌లైఫ్') పెంచడానికై మందుకు కొన్ని రసాయనాలు కలపవలసి వుంటుంది. వాటి కారణంగా అవాంఛిత ప్రభావాలు 'సైడ్ ఎఫెక్ట్స్' కలుగుతాయి. వాటిని తగ్గించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. క్వాలిటీ పరంగా ఉన్నతమైన ప్రమాణాలు పాటించాలి. ఈ ప్రక్రియను పర్యవేక్షించే ప్రభుత్వ యంత్రాంగం నుంచి, ప్రభుత్వ సంస్థల నుంచి లైసెన్సులు అవీ తెచ్చుకోవాలి. అప్పుడే ఆ రోగానికి మందు మనకు లభ్యమౌతుంది.

వ్యాక్సిన్ విషయంలో ఈ కసరత్తు మరింత ఎక్కువగా వుంటుంది. ఆ క్రిమిని ఒక జీవిలో ప్రవేశ పెట్టి, దాన్ని ఎదుర్కోవడానికి ఆ జీవి తయారుచేసే యాంటీ-బాడీ (రక్షకకణాలు)లు సేకరించి, వాటిని విడిగా తీసి, పరిమాణంలో విపరీతంగా పెంచి, టీకా తయారుచేయాలి. తర్వాత ఎలుకలు, కుందేళ్లు వంటి జంతువులపై ప్రయోగించి, అవి విజయవంతమైతే ఆరోగ్యవంతులైన విభిన్న రకాలైన మనుష్యులపై (పిల్లలు, స్త్రీలు, పురుషులు వగైరా) ప్రయోగించి చూడాలి. ఔషధం విషయంలో అయితే వ్యాధి తగ్గిందో లేదో వెంటనే తెలిసిపోతుంది. వాక్సిన్ విషయంలో అయితే వ్యాధి మామూలుగానే సోక లేదో, దీని కారణంగా సంక్రమించకుండా ఉందో తెలుసుకునేందుకు సమయం పడుతుంది. ఆ తర్వాత ఔషధం విషయంలో వున్న దశలన్నీ దాటుకుని ప్రజల వద్దకు రావాలి.

ఇవన్నీ ఏ వ్యాధికైనా వర్తిస్తాయి. ఇప్పుడీ కోవిడ్ 19 విషయానికి వస్తే ఔషధాన్నే యింకా కనుక్కోలేదు. మలేరియాకు వాడిన రెట్రోవైరల్ మందుల్ని వాడి చూస్తున్నారు. వాటివలన కొందరికి రోగలక్షణాలు ఉపశమిస్తున్నాయి తప్ప రోగం నయం అయిందని అనుకోవడానికి లేకుండా ఉంది. వాటిని కాస్త అటూయిటూ చేసి (టింకరింగ్) కోవిడ్ 19కు మందు కనిపెట్టవచ్చు. ఇదింకా ట్రయల్ అండ్ ఎర్రర్ దశలోనే వుంది. అర్జునుడి బాణం పక్షి కన్నుకి తగలటం లేదు. ఏ ముక్కుకో తగులుతోంది.

ప్రపంచంలోని 40 దేశాల శాస్త్రజ్ఞులందరూ ఒక్కుమ్మడిగా ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. పరిస్థితి తీవ్రతను గమనించి ప్రభుత్వాలు విధి విధానాలలో (ప్రొటోకాల్)కు సడలింపు యిచ్చి త్వరలో అందుబాటులోకి తేవచ్చు. ఔషధం పరిస్థితే అలా వున్నపుడు యిక టీకా సంగతి ఊహించుకోవచ్చు. నాకున్న పరిమిత పరిజ్ఞానం, అనుభవం బట్టి, అది మార్కెట్‌లోకి వచ్చేసరికి రెండేళ్లు పట్టవచ్చు. సడలింపులు యిచ్చేసి, రిస్కు తీసుకునైనా వ్యాక్సిన్‌ను మార్కెట్లో విడుదల చేసేసి, కావాలంటే తర్వాత సవరణలు చేసుకుందాం అని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ అనుకుంటే ఏ 18 నెలలో కనీసం పట్టవచ్చు. అది అందరికీ అందుబాటు ధరలో లభించినప్పుడే దాని వలన విస్తృత ప్రయోజనం కలుగుతుంది.

ఎప్పుడు వస్తుందో, ఎలా తయారవుతుందో, తెలియనప్పుడు దాని ధర గురించి యిప్పుడే మాట్లాడడం అవివేకం అవుతుంది. అందువలన 'శాంతా' వరప్రసాద్‌లా కాకుండా మీలో ఒకడిగా, ఒక పౌరుడిగా నా భావాలు పంచుకోవడానికి యీ మాధ్యమాన్ని ఉపయోగించుకుంటున్నాను. నా ఉద్దేశం ప్రకారం ఈ కోవిడ్‌యే కాదు, మరే అంటువ్యాధికైనా వాక్సిన్ మన చేతిలోనే వుంది. టీకా కనుక్కునేలోగా వైరస్ తన స్వభావాన్ని మార్చుకోవచ్చు. ఆంథ్రాక్స్, జికాలకు టీకాలు యింకా కనుక్కోనేలేదు. స్వైన్ ఫ్లూ టీకాకి రెండేళ్లు పట్టింది. దీని వ్యాక్సిన్ వచ్చేలోగానే రోగ ఉధృతి తగ్గుతుంది, మనకు దాన్ని తట్టుకునే శక్తి (హెర్డ్ ఇమ్యూనిటీ) కలుగుతుంది. కానీ వైరస్ మరో రూపంలో తలెత్తుతుంది. డెంగ్యూ, చికెన్ గున్యా వంటి కొన్ని వైరస్‌లు కీళ్లపై తమ తడాఖా చూపితే యిది ఊపిరితిత్తులకు ఎసరు పెట్టింది కాబట్టి భయపడ వలసివస్తోంది. మరొకటి గుండెకే గురి పెట్టవచ్చు. అందువలన అన్నిటికి కలిపి ఒక వ్యాక్సిన్ చేతిలో వుండడం మేలు.

వ్యాక్సిన్ అంటే ఏమిటి? రోగనివారణకు సాధనం. అదేదో ఇంజక్షన్ రూపంలోనో, చుక్కల రూపంలో మాత్రమే వుంటుందని ఎందుకనుకోవాలి? మన చేతుల్లో, చేతల్లో కూడా వుండవచ్చుగా! మన ఒంట్లో, యింటిలో, వంటింటిలో ఉండవచ్చుగా! మన నడతలో, జీవనశైలిలో వుండవచ్చుగా! ఆ దిశగా ఆలోచింప చేయడానికే ఈ ప్రయత్నం.

ముందుగా ఈ కరోనా విపత్తు ఎదుర్కోవడానికి అహరహం శ్రమిస్తున్న వైద్యులకు, ఆరోగ్యసిబ్బందికి, సంబంధిత ఉద్యోగులందరికీ, అదుపు తప్పుతున్న వారిని వారి క్షేమం కోసమే అదలిస్తున్న పోలీసులకు, ఎన్నో యిబ్బందులను సహించి, ఆరోగ్యాన్ని పణంగా పెట్టి అత్యవసర సర్వీసులను అందిస్తున్న వారందరికీ నమోవాకాలు అర్పిస్తున్నాను. అదే సమయంలో తమ విదేశీ పర్యటనల సమాచారం దాచివేస్తూ, పరీక్షలు చేయించుకోవడానికి నిరాకరిస్తూ, నారాయణరూపాలైన వైద్యులతో కలహిస్తూ, బెదిరిస్తూన్న వారందరినీ గర్హిస్తున్నాను. వీరిలో ఉన్నతాధికారులు, ఉన్నతవర్గాల వారు కూడా వుండడం చూసి నిర్ఘాంతపోతున్నాను.

(మిగతా 6, 7 పేజీలలో)

నెల్లూరు కబుర్లు

# సెలవులో ఎస్పీ



జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ ఈనెల 15వ తేదీ నుండి సెలవు పెట్టి నట్లు తెలుస్తోంది. కరోనా వైరస్ నేపథ్యంలో లాక్‌డౌన్ అమలవు తుండగా, ఇంత సీరియస్ వాతావరణంలో ఆయన సెలవులో వెళ్లడం చర్చనీ యాంశంగా మారింది. ఇప్పుడు ప్రభుత్వ వైద్యులు, పోలీసులతోనే పని. సామాన్యంగా ఉన్నతాధికారులు ఎవరూ ఇలాంటి సమయంలో సెలవులు పెట్టరు. కానీ భాస్కర్‌భూషణ్ మాత్రం ఇటీవల జిల్లాలో జరిగిన కొన్ని రాజకీయ సంఘటనలు, ప్రజాప్రతి నిధులు తనపై చేసిన ఆరోపణలకు నొచ్చుకునే సెలవుపై వెళ్ళినట్లు తెలుస్తోంది.

# లవ్ అగర్వాల్‌కు నెల్లూరుతో లింక్



దేశంలో కరోనా వైరస్ ప్రబలిన తర్వాత ప్రజలకు ప్రతిరోజు అన్ని టీవీ చానల్స్‌లో కనపడే వ్యక్తి లవ్ అగర్వాల్. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సహాయ కార్యదర్శిగా ఆయన పని చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం హెల్త్ బులిటెన్‌లు విడుదల చేసేది ఆయనే! ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో కరోనాపై పోరాటంలో ఆయన కూడా భాగస్వామి అయ్యారు. లవ్‌అగర్వాల్‌కు నెల్లూరుజిల్లాతోనూ సంబంధాలు న్నాయి. 1999 – 2000 కాలంలో ఆయన నెల్లూరు జిల్లా జాయింట్‌కలెక్టర్‌గా పని చేశారు. జిల్లాలో చాలా మందికి ఆయన సుపరిచితుడు కూడా!

# పోలీసులపై బెదిరింపులు వద్దు



ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి జన సమూ హాలను ఒకే చోట చేర్చడాన్ని నియంత్రించినందుకు పోలీసు అధికారులను నిందించడం, బెదిరించడాన్ని నెల్లూరు జిల్లా పోలీసు అధికారుల సంఘం ఖండిస్తోం దని సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు తెలిపారు. నెల్లూరులోని సంఘం కార్యాలయంలో ఈనెల 12న విలేకర్లతో మాట్లాడుతూ కరోనా విపత్తు నేపథ్యంలో జిల్లాలోని ప్రతినిధులు అనేక సేవా కార్య క్రమాలు నిర్వహిస్తున్నారని, జిల్లాలో కరోనా కేసులు పెరుగుతుండడం, 30 రెడ్‌జోన్లు ఉన్న పరిస్థితుల్లో పోలీసులకు సహకరించాల్సిన ప్రజా ప్రతినిధులు జన సమూహాలతో వెళ్లి సంక్షేమ ఫలాలు అందించడం శ్రేయస్కరం కాదన్నారు. అసోసియేషన్ కోశాధికారి తురకా శ్రీనివాసులు పాల్గొన్నారు.

# శ్రీరామచంద్రుడికి పుష్పయాగం

నెల్లూరు దర్గామిట్ట రామ్‌నగర్‌లోని శబరి శ్రీరామ క్షేత్రంలో కోదండరామస్వామికి ఈనెల 12న పుష్ప యాగాన్ని కనులపండువగా నిర్వహించారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## నెల్లూరు కార్పొరేషన్
# బంపర్ ఆఫర్

**ముందుగా ఆస్తిపన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ**



నెల్లూరు నగరపాలక సంస్థ బంపర్ ఆఫర్ ప్రకటిం చింది. ఆస్తి పన్ను ముందుగా చెల్లించేవారికి 5 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కరోనా కష్ట కాలంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఆర్థిక వనరులను సమీకరించుకోవడానికి దృష్టి సారించింది. ఈక్రమంలో నెల్లూరు నగరంలోని 54 డివిజన్లలో దాదాపు 1.50 లక్షల అసెస్ మెంట్లు (పన్ను చెల్లించే ఇళ్ళు) ఉన్నాయి. ప్రతి ఆరునెలలకు ఒకసారి పన్ను చెల్లించాల్సి వుం టుంది. ఇలా ఏటా పన్ను రూపంలో కార్పొరేషన్ కు రూ. 74 కోట్ల ఆదాయం సమకూరుతుంది. అయితే ప్రస్తుత ఏప్రిల్ నెలలో చెల్లించాల్సిన పన్నును చెల్లిస్తూనే ఈ ఏడాది అక్టోబర్ నెలలో చెల్లించవలసిన వాయి దాను కూడా ఈ నెలాఖరులోగా చెల్లిస్తే రెండవ వాయిదాలో 5 శాతం రాయితీ ఇవ్వాలని నగరపాలక సంస్థ నిర్ణయించింది. ఆర్థిక భారాన్ని అధికమించే దుకు రాష్ట్ర ప్రభుత్వం సూచనలు మేరకు కార్పొరేషన్ ఈ నిర్ణయం తీసుకుంది.

## కరోనా కాలంలో..
# ఉచిత కరెంట్ ఇవ్వాలి

**- కోటంరెడ్డి కోరిక**




ప్రస్తుత పరిస్థితుల్లో 200 యూనిట్లు వినియోగం కలిగిన వారి కరెంటు బిల్లులు రద్దు చేసి, మూడు నెలలు పాటు ఉచితంగా కరెంటును అందించాలని టీడీపీ నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. నెల్లూరులోని పార్టీ కార్యా లయంలో ఈనెల 12న విలేకర్లతో మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను తొలగించారని ఆరోపించారు. కక్ష సాధింపు చర్యలను మానుకుని కరోనా కట్టడికి ముఖ్య మంత్రి జగన్ కృషి చేయాలని సూచించారు. లాక్‌డౌన్ ఎత్తివేసే వరకు ప్రజలను ప్రభుత్వమే ఆదుకోవా లన్నారు. ప్రతి ఒక్కరికి మాస్కులు, శానిటైజర్లు ఉచి తంగా అందజేయాలని కోరారు. రెడ్‌జోన్ ప్రాంతాల్లో నిత్యావసర సరుకులు ఉచితంగా అందజేయాలన్నారు. ఉచ్చి భువనేశ్వరీప్రసాద్, పసుపులేటి మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# జయభారత్‌లో రక్తదానం

నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రిలో ఈనెల 14న సింహపురి వైద్యసేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి సిబ్బందితో పాటు అనేకమంది ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మేనేజర్ గురుప్రసాద్ మాట్లాడుతూ లాక్‌డౌన్ నేపథ్యంలో రోగు లకు రక్తం కొరత తీవ్రంగా ఉండడంతో, రోగులను ఆదుకునేందుకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామ న్నారు. దాతలు ముందుకువచ్చి రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటి మేనేజర్ కృష్ణారెడ్డి, ఆర్ఎస్ఎస్ నాయకుడు భాస్కర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యులు సురేష్, రాజేంద్రప్రసాద్, అంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## నగర ప్రజలకు
# ఆన్‌లైన్ వస్తువులు

కోవిడ్–19లో భాగంగా నెల్లూరు నగర ప్రజలకు అవసరమగు నిత్యావసర వస్తువులను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసుకునేందుకు రూపొందించిన nellore delivery.in వెబ్‌సైట్‌ను జిల్లా కలెక్టర్ యం.వి. శేషగిరిబాబు, జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ సమక్షంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. వెబ్‌సైట్ సి.ఇ.ఓ. సంతోష్ మాట్లా డుతూ నగర ప్రజలకు అవసరమైన నిత్యావసర వస్తువులను ఈ వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకున్నట్లైతే డోర్ డెలివరీ చేయబడుతుందని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారాగాని లేదా క్యాష్‌గా నగదు చెల్లింపు చేయ వచ్చునని తెలిపారు. నగర ప్రజలు ఈ సదుపాయంను సద్వినియోగం చేసుకోవాలని సిఇఓ కోరారు.

# భక్తిశ్రద్ధలతో ఈస్టర్..

నెల్లూరు జిల్లాలోని క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఈనెల 12న భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. లాక్‌డౌన్ కారణంగా తమతమ ఇళ్ళలోనే ప్రార్థనలు నిర్వహిం చారు. నెల్లూరు సుబేదారుపేటలోని రోమన్ కేథలిక్ చర్చిలో బిషప్ ఈస్టర్ జ్యోతిని వెలిగించి వేడుకలను ప్రారంభించారు. దేశంలో కరోనా మహమ్మారి నుంచి ప్రజలంతా క్షేమంగా బయటపడాలని ప్రార్థించారు. లోన్ స్టార్ చర్చి, డొనేహాలు, మూలాపేటలోని తెలుగు బాప్టిస్టు చర్చిలతో పాటు అన్ని చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# తడిసిన ధాన్యాన్ని కొంటాం

**- డిఎస్ఓ బాలకృష్ణారావు**

జిల్లాలో ఇటీవల అకాల వర్షాలకు తడిసిపోయిన ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకునివస్తే ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వాటిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని డిఎస్ఓ బాలకృష్ణారావు చెప్పారు. ఈనెల 10న ఆయన నెల్లూరులోని జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలా కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు సరఫరా చేస్తామన్నారు. రైస్‌మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలని, సిఎంఆర్ కింద సరఫరా చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యం ఇవ్వాలని ఆయన తెలిపారు.

## అమెరికాలో
# నెల్లూరు విద్యార్థిపై కాల్పులు

ఇటీవల అమెరికాలో నల్లజాతీయులు జరిపిన కాల్పుల్లో నెల్లూరుజిల్లా మనుబోలు మండలం మడమనూరుకు చెందిన విద్యార్థి దేగా ధీరజ్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. పొదలకూరు మండలంకు చెందిన ధీరజ్‌రెడ్డిని తల్లిదండ్రులు లేకపోవడంతో మడమనూరులోని తాత బిరదవోలు రామసుబ్బారెడ్డి చదివిస్తున్నాడు. ఇటీవల ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లాడు. ఈ నెల 11వ తేదీన చికాగోలోని సెయింట్ లూయిస్‌కు వెళ్లాడు. అక్కడ ఓ చోట సెల్లార్‌లో కారు పార్కింగ్ చేస్తుండగా అక్కడేవున్న నల్లజాతీయుడు ధీరజ్‌రెడ్డిపై కాల్పులు జరిపి పారి పోయాడు. ధీరజ్‌రెడ్డి తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## జిల్లా వృత్తి విద్యాశాఖ
# అధికారిగా శేషయ్య

జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారిగా బి.వెంకట శేషయ్యను నియమిస్తూ ఇంటర్ బోర్డ్ కమిషనర్ రామ కృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 31న వెంకట శేషయ్య ఇదే ఉద్యోగంలో ఉంటూ ఉద్యోగ విరమణ చేశారు. మళ్లీ ఆయనే ఈ బాధ్యతల్లో నియమించారు. ఈనెల 14వ తేదీన తన కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించడం కూడా జరిగింది.

## అత్యవసరమైతేనే
# ఉచిత ఓపీ సేవలు పొందాలి

అత్యవసరమైన ఆరోగ్య సమస్యలు ఉంటేనే గుర్తింపు పొందిన వైద్యశాలల్లో ఉచిత ఓపీ సేవలను పొందా లని ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ నాగార్జున ఈనెల 12 న ఒక ప్రకటనలో పేర్కొన్నారు . దగ్గు, జలుబు వంటి లక్షణాలతో వచ్చే రోగులకు ప్రత్యేక ఓపీ, ప్రత్యేక ద్వారాన్ని ఏర్పాటు చేయాలని వైద్యులకు సూచించారు. ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే ఓ పీ సేవలు అందించాలని కోరారు. ఎన్–95 మాస్కులు వాడాలని, ఏ మాత్రం కరోనాగా అనుమానించిన తక్షణమే రోగులను ప్రత్యేక వార్డుల్లోకి మార్చాలన్నారు. కరోనా అనుమానితులు, పాజిటివ్ కేసులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత సేవలు లభిస్తాయన్నారు. రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు లేని వారు పెద్దాసుపత్రిలోని తమ కార్యాలయాన్ని సంప్రదిస్తే వారికి సీఎంసీఓ లేఖను అందజేస్తామని దీని ద్వారా ఉచిత సేవలు పొందవచ్చున్నారు.

## నిబంధనలు పాటించకుంటే
# చర్యలు తప్పవు

**- ప్రైవేట్ పాఠశాలలకు డిఇఓ హెచ్చరిక**

కరోనా మహమ్మారి నేపథ్యంలో జిల్లాలో లాక్‌డౌన్ కారణంగా అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవులు ప్రకటించామని, 6 నుంచి 9వ తరగతి వరకు చదువు కుంటున్న విద్యార్థులకు సమ్మేటివ్–2 పరీక్షలు లేకుం డానే ఉత్తీర్ణులుగా ప్రకటించి పైతరగతులకు వెళ్లే అవకాశం కల్పించినట్లు అన్ని పాఠశాలల వారికి తెలిపామని, అయినా కొన్ని విద్యాసంస్థలవారు ఆన్ లైన్‌లో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోందని, నిబంధనలను ఉల్లంఘించేవారిపై చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దనా చార్యులు ఒక ప్రకటనలో హెచ్చరించారు. నిబంధనలు పాటించకుండా తరగతులు నిర్వహించినా, పరీక్షలకు సన్నద్ధమైనా ఆయా పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## కొత్త రేషన్‌కార్డులకు
# దరఖాస్తు చేసుకోండి

రేషన్‌కార్డులు లేనివారు, కొత్తకార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. రేషన్‌కార్డ్ లేని వారు సంబంధిత సచివాలయంలో దరఖాస్తు ఇస్తే చాలు, కేవలం అయిదు రోజుల్లోనే దానిని విచారించి కొత్త కార్డు మంజూరు చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కార్డు పొందిన వారు వెంటనే రేషన్ సరుకులు పొందే అవకాశం కల్పిస్తున్నారు. ఇప్పటికే సుమారు 5వేల మంది దాకా కొత్తగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఈ దరఖాస్తులన్నిటినీ పరిశీలించి, విచారణ జరిపి కొత్త కార్డులను అందజేస్తు న్నారు. జిల్లాలో 9.04లక్షల దాకా రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈ కార్డులన్నిటికీ రెండో విడత రేషన్ సరుకులు అందజేయనున్నారు.

## దుకాణాలను
# తనిఖీ చేస్తున్న అధికారులు

జిల్లాలోని పలు దుకాణాల్లో ఈనెల 15న తూనికలు కొలతల శాఖ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. కిరాణా దుకాణాలు, మందుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అధికార ధరలకు వస్తువులను విక్రయిస్తున్నట్లు గుర్తించి రెండు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో తూనికలు కొలతల శాఖ డిప్యూటి కంట్రోలర్ థామస్, రవికుమార్, ఇన్స్‌పెక్టర్ శ్రీధర్‌తో పాటు విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

# అన్నదాతలనిపించారు

## టీటీడీ ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి



ఆకలితో వున్నవారిని ఆదుకోవడంలో నెల్లూరు జిల్లా రైతులు అన్నదాత అన్న పేరును సార్ధకం చేశారని తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి కొనియాడారు. ఈ నెల 11వ తేదీన నెల్లూరులోని వైసిపి జిల్లా కార్యాలయంలో సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'సర్వేపల్లి రైతన్న కానుక' కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కరోనా కష్టకాలంలో ఎంతో మంది పేదలు పనులు లేక ఇబ్బందులు పడే పరిస్థితి వుండగా రాష్ట్ర ప్రభుత్వంలో ఏ ఒక్కరూ ఆకలితో వుండకుండా పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలోనే వినూత్నంగా సర్వేపల్లి ఎమ్మెల్యే రైతుల దాతృత్వంతో ధాన్యాన్ని సేకరించి బియ్యంగా ఆడించి పేదలకు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు కూడా సర్వేపల్లి ఎమ్మెల్యే కార్యక్రమాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జూలై 19న తలపెట్టిన

# స్వామిదాస్ స్కూల్ స్వర్ణోత్సవ వేడుక వాయిదా

50 యేళ్ళ క్రితం నెల్లూరులో పురుడు పోసుకున్న శ్రీ బి.స్వామిదాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ స్వర్ణోత్సవ సంబరం జూలై 19, 2020న జరుగవలసి వుంది. అయితే కరోనా మహమ్మారి యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్న తరుణంలో ఈ సంబరాలు ఆరోగ్యకరం కాదని భావించిన స్కూల్ నిర్వాహకులు వేడుకలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ప్రపంచ నలు మూలలా విస్తరించి వున్న స్వామిదాస్ స్కూల్ పూర్వవిద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో ఈ వేడుకలో పాల్గొనే అవకాశం ఉండడంతో వేడుకల తదుపరి తేదీని తరువాత తెలియజేస్తామని స్కూల్ యాజమాన్యం ప్రకటించింది. స్వామిదాస్ వార్షికోత్సవమంటే తమ ఇంటి వేడుకగా, తమ ఊరి సంబరంగా భావించి వచ్చే పూర్వ విద్యార్థులంతా ఈసారి ఆలస్యంగా ఆ ఉత్సవాన్ని జరుపుకోవాల్సి వస్తోంది.

### పాత్రికేయులకు అండగా లాయర్ పత్రిక

# రూ. లక్ష విరాళం



కరోనా మహమ్మారి చాపక్రింద నీరులా వ్యాపిస్తున్న తరుణంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలను చైతన్య పరచడంలో నిత్యం నిమఘ్నమై వున్న చిన్న, పెద్ద పత్రికల విలేకరుల సంక్షేమం కోసం 'లాయర్' పత్రిక రూ. 1,00,000/– (లక్ష రూపాయలు) విరాళాన్ని అందించింది.

'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారి స్మృత్యంకంగా ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో రాజ్యసభ సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వారి సతీమణి, తిరుమల తిరుపతి దేవస్థానాల ట్రస్టుబోర్డు సభ్యురాలు శ్రీమతి ప్రశాంతిరెడ్డిల చేతుల మీదుగా జిల్లా కలెక్టర్‌కు లాయర్ పత్రిక నిర్వాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి(ప్రభు) అందజేశారు.

# రాజ్యాంగ నిర్మాతకు నివాళులు



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 13వ తేదీన నెల్లూరులోని ఆయన విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రూప్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. నెల్లూరులోని కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు, జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శేషగిరిబాబు అంబేద్కర్ చిత్రపటా లకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొడవలూరు మండలం రాజుపాలెంలో ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, సూళ్లూరు పేటలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కావలిలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, పొదలకూరులో ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. నెల్లూరు ఏఎంసీ చైర్మన్ ఏసునాయుడు, కాంగ్రెస్‌పార్టీ ఎస్టీ సెల్ చైర్మన్ టి.బాలసుధాకర్ తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.







# రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తొలగింపు అప్రజాస్వామికం

## - సోమిరెడ్డి



రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎన్.రమేష్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించడం అప్రజాస్వామికమని మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని ఆయన నివాసం నుంచి ఈనెల 12న మీడియాతో మాట్లాడుతూ ఈసీని అప్రజాస్వామికంగా, కక్షపూరితంగా తొలగిస్తుంటే గవర్నర్ అడ్డుకోకపోవడం దుర దృష్టకరమన్నారు. నిబంధనల ప్రకారం ఎన్నికల కమిషనర్ వయస్సు 65 ఏళ్ళ లోపు ఉండాలని, కాని కొత్త కమిషనర్‌గా నియమించిన కనగరాజ్ వయస్సు 84 ఏళ్ళని పేర్కొన్నారు. సీఎం జగన్ తీసుకుంటున్న ఘోరమైన నిర్ణయాలను గవర్నర్ కళ్ళు మూసుకుని ఎందుకు సంతకం పెడుతున్నారని, గవర్నర్‌ని కూడా బెదిరింపులకు గురిచేస్తున్నట్లుగా ఆలోచించాల్సి వస్తోందని ఆయన ఆరోపించాడు. గతంలో ముఖ్యమంత్రులు తీసుకున్న కొన్ని నిర్ణయాలపై కోర్టులు తప్పు పట్టినందుకు నీలం సంజీవరెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, బిజు పట్నాయక్ లాంటి వారు తమ పదవులకు రాజీనామా చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ.. జగన్‌కి అంత చిత్తశుద్ధి ఉంటుందని తాననుకోవడం లేదన్నాడు. అధికార పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హైదరాబాద్, బెంగుళూరులకు యధేచ్ఛగా పోయి వస్తున్నారని, ఈ కరోనా కాలంలో వాళ్ళెవరికి అవసరం లేని క్వారంటైన్ చంద్రబాబునాయుడు అమరావతికి రావాలంటే అవసరమైందా? అని సోమిరెడ్డి ప్రశ్నించాడు.

### కరోనా కష్టకాలంలో...

# సొంత ఊరికి సతీష్‌రెడ్డి చేయూత



డిఆర్‌డిఓ ఛైర్మెన్ గుండ్రా సతీష్‌రెడ్డి చొరవతో ఆయన స్వగ్రామమైన ఆత్మకూరు మండలంలోని మహిమలూరులో ఈనెల 16న 10వేల మాస్కులు, 5వేల శానిటైజర్ సీసాలు పంపిణీ చేశారు. అలాగే అంతకుముందు 14వ తేదీన సతీష్‌రెడ్డి సహకారంతో గిరిజనకాలనీవాసులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుడుముల సుధాకర్‌రెడ్డి, ఆర్డీఓ రమాదేవి, ఆత్మకూరు తహశీల్దార్ వై.మధుసూదన్‌రావు, సతీష్‌రెడ్డి సోదరుడు గుండ్రా శ్రీనివాస్‌రెడ్డి, వైయస్సార్సీపి నాయకులు చిట్టమూరు జితేంద్రనాథ్‌రెడ్డి, నిజమాల నరసింహులు, సానా వేణుగోపాల్‌రెడ్డి, పంచాయతి కార్యదర్శి గౌస్, విఆర్‌ఓ కృష్ణయ్య తదితరులు పాల్గొని లాక్‌డౌన్‌తో గిరిజనులు ఇబ్బందిపడకుండా సతీష్‌రెడ్డి తనవంతు సేవలం దించడాన్ని అభినందించారు.




## 'ప్రభా'తం

# 'విశ్వగురు' పాత్రలో భారత్

ప్రపంచమంతా ఆపదలో ఉన్న ఈ సమయంలో చైనా, ఇతర దేశాల అవసరాన్ని తన వ్యాపార అవకాశాలుగా మలచుకోగా, భారత్ మాత్రం దీనిని ఆపద సమయంలా భావించి అన్ని దేశాలకు ఆపన్నహస్తం అందించింది. ఓ పక్క అంతర్గతంగా కరోనా వైరస్‌తో పోరాటం సాగిస్తూనే... అమెరికాతో సహా దాదాపు 13 దేశాలకు వైద్యపరమైన సేవలందించింది. ఆయా దేశాలు కోరిన ఔషధాలను, వైద్య పరికరాలను వారికి నిరంతరం సరఫరా చేసి ప్రపంచం పట్ల తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించింది. ప్రపంచంలోని అన్ని జీవులను ఎలా ఆదరించాలి, తద్వారా ఈ భూమిని ఎలా కాపాడుకోవాలి అనే మౌలిక సూత్రాలు నేర్చుకోవడానికి ఈరోజు అన్ని దేశాలకు భారత్ విశ్వగురువుగా మారింది.



ప్రపంచానికి భారత్ విశ్వగురువు కావాలనేది ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్ష. ఆయన ఆరు ఏళ్ళ క్రితం ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి భారత్‌ను విశ్వగురువుగా మార్చాలనే ప్రయత్నాల్లో ఉన్నారు. మొదటి దఫా ప్రభుత్వంలో ఆయన ఐదేళ్ళపాటు ప్రపంచంలో దాదాపు 50కి పైగా దేశాల్లో పర్యటించారు. విదేశీ సంబంధాలు మునుపెన్నడూ లేని విధంగా బలోపేతం చేశారు. ఒక్క పాకిస్థాన్ చైనాలతో తప్పితే ఇతర దేశాలతో భారత్ సంబంధాలు ఎంతో మెరుగు పడ్డాయి. ఆర్థిక, వాణిజ్య సంబంధాలు ఎంతో ముందడుగు వేశాయి. మోడీ జరిపిన కృషి ఫలితంగా అగ్రరాజ్యాలు సైతం భారత్‌ను ఒక దిక్సూచిగా గౌరవిస్తూ వచ్చాయి. గత కొన్ని ఏళ్ళకాలంలో అంతర్జాతీయంగా భారత్‌కు ఎనలేని ప్రాధాన్యత పెరిగింది. భారత్‌ను అన్ని దేశాలు కూడా నమ్మకమైన నేస్తంగా పరిగణిస్తూ వచ్చాయి. చరిత్రపరంగా చూస్తే భారత్‌కు ఇతర దేశాలలా ఆక్రమించుకునే చెడ్డ గుణం లేకపోవడం, ఇతర దేశాల విషయాలలో జోక్యం చేసుకోకపోవడం వంటి అంశాలు మనకు కలిసొచ్చాయి. అంతేకాకుండా అంతర్జాతీయ ఉగ్రవాదంపై పోరులో భారత ప్రధానిగా నరేంద్ర మోడీ పోషించిన భూమికను అన్ని దేశాలు గుర్తించాయి. కాబట్టే ఉగ్రవాదంపై పోరులో భారత్ వాదానికి మద్దతుగా నిలిచాయి. ఎన్నో అంతర్జాతీయ వేదికలపై సైతం మెజారిటీ దేశాలు భారత్ అభిప్రాయాలను సమర్థించాయి. భారత్ - పాక్ మధ్య జరుగుతున్న ప్రత్యక్ష, పరోక్ష పోరాటాలలో సైతం ఈ దేశాలన్నీ కూడా భారత్‌కే వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి.

నిన్నటి వరకు ఉగ్రవాదంపై పోరు సాగించిన భారత్, ఇప్పుడు మరో అంతర్జాతీయ శత్రువుతో పోరాడుతుంది. ఆ శత్రువే కరోనా వైరస్. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారి ఇది. మత ప్రేరేపిత ఉగ్రవాదం కంటే ప్రమాదకరంగా మారింది. ఉగ్రవాదం కేవలం కొన్ని దేశాలను మాత్రమే ఇబ్బంది పెడుతుంటే, కరోనా వైరస్ 210 దేశాలను అతలాకుతలం చేసింది. మతం, జాతి సంబంధాలు లేకుండా అన్ని దేశాలను పట్టి పీడిస్తోంది. ఈ వైరస్ ధాటికి పేద దేశం, పెద్ద దేశం అనే తేడా లేకుండా పోయింది. నిన్నటి వరకు అగ్రరాజ్యాలని చెప్పబడ్డ అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ వంటి దేశాలే ఈ వైరస్ ధాటికి విలవిలలాడుతున్నాయి. ఇలాంటి సమయంలో ప్రపంచవ్యాప్తంగా భారత్ అత్యంత కీలకపాత్ర పోషిస్తుండటం గమనార్హం. భారత్‌ను విశ్వగురువుగా నిలపాలన్న ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్షలకు ఇప్పుడే అంకురార్పణ జరిగినట్లయ్యింది.

కరోనా దెబ్బకు పెద్ద దేశాలు అన్నీ దెబ్బతినిపోగా, 130 కోట్ల జనాభా కలిగిన భారత్ మాత్రం ఈ మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కొంది. చైనా, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు కరోనా వైరస్ ప్రభావంతో అన్ని విధాలుగా నష్టపోయాయి. ఆ దేశాలలో వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందింది. విద్య, వైద్య పరంగా అంతగా అభివృద్ధిలేని భారత్‌లో ఈ వైరస్ వ్యాపిస్తే లక్షలు దాటి కోట్ల సంఖ్యలోకి వెళుతుందని అంచనాలు కూడా వేశారు. వాస్తవంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌లాగా భారత ప్రధాని నరేంద్ర మోడీ కూడా దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరించి ఉంటే.. ఈ సమయానికి దేశంలో రోగుల సంఖ్య లక్షలు దాటి కోట్లకు చేరుకునేది. కానీ ప్రధాని నరేంద్ర మోడీ సరైన సమయంలో తీసుకున్న లాక్‌డౌన్ నిర్ణయం మూలంగా ఈ సంఖ్య వేలు దాటడం లేదు. అసలు దేశంలో నిజాముద్దీన్ మర్కజ్ సంఘటన జరగకపోయి ఉంటే, ఈసరికే దేశమంతా లాక్‌డౌన్ పరిస్థితి ఉండేది కాదు. దేశమంతా కూడా ఎంతో ప్రశాంతంగా ఉండేది. కరోనా వైరస్ అతితక్కువ ప్రాంతాలకు మాత్రమే పరిమితమై ఉండేది. దురదృష్టవశాత్తు నిజాముద్దీన్ మర్కజ్ సంఘటన మూలంగా దేశంలో ఎక్కువ ప్రాంతాలకు ఈ వైరస్ విస్తరించింది. అయినా కూడా వైద్య వసతులు అంతంత మాత్రంగానే ఉన్నా.. దేశవ్యాప్తంగా పాలనా యంత్రాంగం, అధికార యంత్రాంగం ఎంతో సమర్థవంతంగా పని చేసి కరోనాను చాలావరకు కంట్రోల్ చేయగలిగారు.

ప్రపంచమంతా ఆపదలో ఉన్న ఈ సమయంలో చైనా, ఇతర దేశాల అవసరాన్ని తన వ్యాపార అవకాశాలుగా మలచుకోగా, భారత్ మాత్రం దీనిని ఆపద సమయంలా భావించి అన్ని దేశాలకు ఆపన్నహస్తం అందించింది. ఓ పక్క అంతర్గతంగా కరోనా వైరస్‌తో పోరాటం సాగిస్తూనే... అమెరికాతో సహా దాదాపు 13 దేశాలకు వైద్యపరమైన సేవలందించింది. ఆయా దేశాలు కోరిన ఔషధాలను, వైద్య పరికరాలను వారికి నిరంతరం సరఫరా చేసి ప్రపంచం పట్ల తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో పాటు ఆయా దేశాల అధినేతల కృతజ్ఞతలను భారత్ అందుకోగలిగింది. ఇదంతా కూడా నరేంద్ర మోడీ సమర్థవంతమైన నాయకత్వం ద్వారానే సాధ్యమైంది.

సర్వేజనా సుఖినోభవంతు... అన్నది భారతదేశ విధానం. జీవన నినాదం. అందరూ బాగుండాలి.. అంతా ఆరోగ్యంగా ఉండాలి.. అన్నదే భారతీయ సంస్కృతి. శవాల మీద వ్యాపారం చేసే గుణం భారతదేశానికి ఎప్పుడూ లేదు. ఈ దేశ సంస్కృతి ఎంతో ఉన్నతమైనది. పంచభూతాలను దైవంగా భావించే సంస్కృతి మన దేశంలో మాత్రమే ఉంది. ఆ పంచ భూతాలే మానవ జీవన ప్రాణవాయువులు. కానీ ప్రపంచం ఈ వాస్తవాన్ని విస్మరించింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందగానే, అత్యాధునిక పోకడలకు అలవాటు పడగానే తాము అగ్రదేశాల కోవలోకి వెళ్ళి పోయామని విర్రవీగుతున్న దేశాలకు ఈ వైరస్ పెద్ద గుణపాఠం నేర్పింది. ప్రకృతితో ఎలా మమేకం కావాలి, ప్రకృతిని ఎలా పూజించాలి, ప్రపంచంలోని అన్ని జీవులను ఎలా ఆదరించాలి, తద్వారా ఈ భూమిని ఎలా కాపాడుకోవాలి అనే మౌలిక సూత్రాలు నేర్చుకోవడానికి ఈరోజు అన్ని దేశాలకు భారత్ విశ్వగురువుగా మారింది.

## దేవుడువెల్లంపల్లిలో శివపార్వతుల కల్యాణం

దక్కిలి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన దేవుడు వెల్లంపల్లి స్తంభాల గిరీశ్వరయ్య స్వామి ఆలయంలో ఈనెల 13న స్వామివారి కల్యాణోత్సవం జరిగింది. లాక్‌డౌన్ నేపథ్యంలో భక్తులెవరూ ఈ వేడుకకు అనుమతించలేదు. ఎంతో నిరాడంబరంగా జరిగిన ఈ కల్యాణోత్సవంలో భాగంగా ఆలయ అర్చకులు ప్రాత:కాల పూజలు, అభిషేకాలతో పాటు స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ఇ.ఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

### కరోనా నుంచి కాపాడాలంటూ..

## మహా పాశుపత హోమం

కరోనా మహమ్మారి నుంచి మానవాళిని కాపాడాలని కోరుకుంటూ నెల్లూరుజిల్లాలోని సోమశిలలో వెలసివున్న కామాక్షి సమేత శ్రీ సోమేశ్వరస్వామివారి ఆలయంలో మహా పాశుపతహోమం నిర్వహించారు. ఈనెల 13న ఆలయ ప్రధానఅర్చకుడు శ్యామయ్య గురుకుల్ ఆధ్వర్యంలో వేదపండితుడు మేళ్ళచెరువు శివకుమారశర్మ తదితరులతో ఆలయంలో నవగ్రహ మండపారాధన, లక్ష్మీగణపతి హోమం, అఘోర మహా పాశుపత హోమం కార్యక్రమాలను నిర్వహించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో భక్తులెవరినీ ఈ కార్యక్రమానికి అనుమతించలేదు.

## మహా ధన్వంతరి హోమం

కరోనా మహమ్మారిని పారద్రోలి మానవాళిని రక్షించాలంటూ నెల్లూరుజిల్లాలోని అనంతసాగరం మండలం వరికుంటపాడులో కొలువై ఉన్న శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఈనెల 14న మహా ధన్వంతరి హోమం నిర్వహించారు. తొలుత నవగ్రహ మండపారాధన, హోమం, గణపతి హోమం నిర్వహించారు.

## సుదర్శన యాగం

నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం కదిరిదేవరాయపల్లిలో కొలువైన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 12న సుదర్శనయాగాన్ని నిర్వహించారు. వేదపండితులు మేళ్లచెరువు శివకుమారశర్మ పర్యవేక్షణలో ఆలయ ప్రధానాచార్యులు పరాంకుశం భానుప్రకాషాచార్యులు, రుత్విక్కులు విశ్వనాథం సుబ్రహ్మణ్యం, మురళీకృష్ణమాచార్యులు, సత్యనారాయణశర్మ ఈ యాగాన్ని నిర్వహించారు.




## కించ పరచడం ఎందుకు?

పుట్టింటిపై ప్రేమ ఉండడంలో తప్పులేదు. కానీ అదే సమయంలో అత్త ఇంటిపై ద్వేషం చూపడం భావ్యం కాదు. ప్రస్తుతం కరోనా వైరస్ ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న తరుణంలో అగ్రరాజ్యమైన అమెరికా కూడా దాని బారిన పడింది. అన్ని దేశాలు ఆపదలో ఉన్న సమయం ఇది. కానీ ఇటీవల స్వాతి అనే యాంకర్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వివాదాస్పదంగా మారింది. భారతదేశ గొప్పతనాన్ని పొగుడుతూ అమెరికాను కించ పరిచేలా వ్యాఖ్యలు చేసింది. మాతృదేశమైన భారత్‌ను పొగడడంలో తప్పులేదు. కానీ ఉపాధి అవకాశాల ద్వారా ఆశ్రయం కల్పిస్తున్న అమెరికాను కించపరచడం భావ్యం కాదు. కొన్ని లక్షల మంది భారతీయులు అమెరికాలో వివిధ రంగాల్లో స్థిరపడిఉన్నారు. వారంతా కూడా ఆర్థికంగా భారత్‌కు సహకరిస్తున్నారు. కాబట్టి ఇటువంటి ఆపద సమయాల్లో అమెరికాకు అండగా నిలవాలని ప్రవాస భారతీయులను కోరుతున్నాను.

– మనోహర చల్లా, హైదరాబాద్.

## ఎమ్మెల్యేలకు తగదు

భూకంపాలు, వరదలు, తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజాప్రతినిధులు బాధితులను గుంపులు గుంపులుగా పిలిచి సాయం అందించడంలో తప్పులేదు. కానీ, ఇప్పుడు వైరస్ ప్రభావంతో ప్రజలను ప్రభుత్వమే ఇళ్ళల్లో నుండి బయటకు రావొద్దంటోంది, బయటకు వచ్చిన జనాలపై కేసులు పెడుతున్నారు. ఇళ్లలోనే ప్రజలను కట్టడి చేయడానికి పోలీసులు ఆపసోపాలు పడుతున్నారు. లాక్‌డౌన్‌ను పటిష్టంగా అమలు చేస్తేనే కరోనా వైరస్‌ను కంట్రోల్ చేయగలమని ప్రధానమంత్రి చెబుతున్నాడు. అయితే జిల్లాలోని కొందరు ప్రజాప్రతినిధులు మాత్రం పేదలకు సాయం అందించడానికి వారిని ఒక చోట గుమికూడేలా చేయడం పద్ధతి కాదు. దీనివల్ల వైరస్ వ్యాప్తిచెందే అవకాశం ఉంది. ఇది సమంజసం కాదు, చేసే సాయాన్ని చెప్పుకోవాల్సిన అవసరం కూడా లేదు కాబట్టి సాధ్యమైనంతవరకు ప్రజలు బయటకు వచ్చే పనిలేకుండా మీ సహాయం అందించాలి.

కోదాడ రాంప్రసాద్, వెంకటగిరి.

## ఇప్పటికైనా మేల్కోండి

మితిమీరిన స్వేచ్ఛ, మైనారిటీ బుజ్జగింపులు, ఓటు బ్యాంకు రాజకీయాలు దేశానికి ఎంత ప్రమాదకరమో ఇటీవల జరిగిన సంఘటనలు నిరూపిస్తున్నాయి. కేవలం మతపరమైన ఉన్మాద చర్యల వల్లే భారతదేశంలో కరోనా కేసులు పెరిగాయి. ఒక వర్గం వారిని పూర్తిగా అనలేం గానీ, ఈ దేశం పట్ల ప్రేమ లేకుండా ఇక్కడి తిండి తింటూ పాకిస్థాన్‌కు జిందాబాద్ కొట్టే కొందరు మతోన్మాదుల వల్ల మాత్రం దేశం ప్రమాదాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇలాంటి వారిని ఉపేక్షించాల్సిన పనిలేదు. దేశం కోసం కాకుండా మతం కోసం పనిచేసే ఏ ఒక్కరిని కూడా క్షమించాల్సిన అవసరం లేదు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అసలు మతపరమైన ప్రచారాలను భారత్‌లో నిషేధించాలి. ఇది హిందూ దేశం. అయినప్పటికీ మన రాజకీయ నాయకుల కుహనాలౌకికవాదం వల్ల అన్యమతస్థుల ప్రభావం ఎక్కువవుతోంది. ఓటుబ్యాంకు దృష్టితో వారికి పూర్తి స్వేచ్ఛనిస్తున్నారు. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.

– పి.రాజీవి, నెల్లూరు.

# విపత్తులోనూ వివాదాలు



అగ్గిపుల్ల సబ్బుబిళ్ళ కుక్కపిల్ల కవితకు కాదేది అనర్హం అని శ్రీశ్రీ చెప్పినట్లు.. మన రాజకీయ నాయకులు తమ రాజకీయాల కోసం విపత్తులను సైతం వదిలిపెట్టడం లేదు. సాధారణ పరిస్థితుల్లో తుఫాన్లు, భూకంపాలు, వరదలు వంటి వైపరీత్యాలు వేరు. ఆ సమయాలలో ప్రజలను ఒకచోట చేర్చి సాయం అందించినా పెద్ద సమస్య ఉండదు.

కానీ ఇది కరోనా వైరస్ కాలం. మనిషి మనిషి మధ్య ఆరడుగుల దూరం ఉండాలని ప్రభుత్వమే చెబుతుంది. అసలు లాక్‌డౌన్ సమయంలో ప్రజలను ఇళ్లలో నుంచి బయటకు రావద్దని ప్రభుత్వం పదేపదే విజ్ఞప్తి చేస్తుంది! ప్రజలకు అవసరమైన వాటిని ఇళ్ళకే చేరవేసే విధంగా అధికార యంత్రాంగం అంతా కూడా కసరత్తు చేస్తోంది. ఇది అత్యంత కీలకమైన సమయం. ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించిన సమస్య. ఒక గుంపులో వైరస్ ఒకరికి ఉంటే చాలు మిగతావారికి కూడా వేగంగా అంటుకుంటుంది. కాబట్టి ప్రతిఒక్కరు కూడా ఎంతో జాగ్రత్తతో వ్యవహరించాల్సిన సమయం. ఈ కరోనా కాలంలో బాధితులను ఆదుకోవాలనే మనసు అభినందించదగిందే! ఎంతో మంది దాతలు, నేతలు తమకు తోచిన విధంగా బాధితులను ఆదుకోవడానికి కృషి చేస్తూనే ఉన్నారు. అయితే బాధితులకు సహాయం అందించే కోణంలో వారిని ఒకచోట చేర్చే ప్రయత్నం మాత్రం ఆమోదించదగినది కాదు. జిల్లాకు చెందిన కొందరు నాయకులు ఇలా బాధితులందరినీ ఒకచోట చేర్చి వారికి సహాయం అందించే ప్రయత్నాలు వివాదాస్పదమయ్యాయి. నాయకులు చేసిన నిర్వాకానికి 24 గంటలు లాక్‌డౌన్ పర్యవేక్షణలో ఉన్న అధికారులే విస్తుపోతున్నారు!

# కరోనాకు రియల్ బలి

• **వరుస దెబ్బలు**



కాలం కలిసి రానప్పుడు తాడు కూడా పామై కరుస్తుందంటారు. రియల్ ఎస్టేట్ రంగం పరిస్థితి ఇప్పుడు అలాగే వుంది. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రంగం రియల్‌ఎస్టేట్. ఎన్నో వ్యాపారాలకు అనుసంధానమై వున్న రంగం కూడా! అలాంటి రియల్ ఎస్టేట్‌తో గత కొంతకాలంగా ప్రభుత్వాలు ఆడుకున్నాయి. ప్రకృతి ఆడుకుంది.. ఇప్పుడు కరోనా వైరస్ కూడా ఆడుకుంటోంది.

గత పదేళ్లుగా రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ పరిస్థితి ఏ మాత్రం బాగాలేదు. ముఖ్యంగా గత ఐదేళ్ల చంద్రబాబు పాలనలో అవలంభించిన విధానాల మూలంగా రియల్ ఎస్టేట్ రంగంలో నిరుద్యోగం అలుముకుంది. తెలుగుదేశం ప్రభుత్వం పోయాక వచ్చిన వైసిపి ప్రభుత్వంలోనైనా రియల్ ఎస్టేట్ కోలుకుంటుందని అందరూ ఆశించారు. దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి పాలనలోలాగా జగన్ పాలనలోనూ రియల్‌ఎస్టేట్ ఒక వెలుగు వెలిగిపోతుందనుకున్నారు. కాని సీన్ రివర్స్ అయ్యింది. వైసిపి అధికారంలోకి వచ్చిందే తడవు, అక్రమ లేఅవుట్లంటూ లే అవుట్లను ధ్వంసం చేయడం, రిజిస్ట్రేషన్‌లు ఆపివేయడం వంటి చర్యలతో మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టైంది. దీనికితోడు కొత్త ఇసుక పాలసీ రియల్ ఎస్టేట్ నెత్తిన పిడుగులాగా మారింది.

ఈ పరిణామాలతో రియల్ ఎస్టేట్ కోలుకోలేనంత కుదుపులకు లోనై వుండింది. ఇప్పుడు కరోనా వైరస్ ఆ మిగిలిన అరకొర ప్రాణాన్ని కూడా తీసేయబోతోంది. కరోనా వైరస్ సృష్టించిన ఆర్థిక సంక్షోభం ధాటికి ఇప్పుడిప్పుడే రియల్ ఎస్టేట్ కోలుకునే పరిస్థితి వుండకపోవచ్చు. ఇక కొన్నాళ్ల పాటు రియల్ వ్యాపారులు లేఅవుట్లు వేయడం, అపార్ట్‌మెంట్లు కట్టడం వంటివాటి జోలికి పోకపోవడమే మేలు.

• సెల్యూట్

# గెలుపు కోసం పోలీస్ అలుపులేని పోరు





సమాజంలో నిన్నటి వరకు పోలీసులంటే చిన్నచూపు, లంచాల కోసం వేధిస్తున్నారని ప్రచారం, అన్నింటికి మించి మన సినిమాల్లో అయితే పోలీసులను విలన్లుగా చూపిస్తుంటారు. 60కేజీల బరువు లేని హీరో 20 మంది పోలీసులను చితక్కొట్టే సన్నివేశాలు ఎన్నింటినో చూస్తుంటాం... ఒకరకంగా ప్రజలలో పోలీసుల పట్ల వ్యతిరేక భావం రావడానికి ఈ సినిమాలే కారణంగా కూడా చెప్పుకోవచ్చు.

ఇప్పుడు అదే పోలీస్ హీరో అయ్యాడు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో తన ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నాడు. విధి నిర్వహణలో అలుపెరుగని పోరాటం చేస్తున్నాడు. ఈరోజు దేశం 21రోజుల లాక్‌డౌన్‌ను అధిగమించిందంటే అందులో ప్రధాన పాత్ర పోలీసులదే! వాళ్లు రోడ్లమీద నిలబడి ఉండబట్టే మనం ఇళ్ళల్లో ప్రశాంతంగా ఉండగలుగుతున్నాం. వాళ్లు వాళ్ల కుటుంబాలను వదిలేసి ఉన్నారు కాబట్టి మనం మన కుటుంబాలతో భద్రంగా ఉన్నాం. ఎండనక వాననక రేయింబవళ్ళు ప్రజల కోసం కష్టపడుతున్న పోలీసులకు ప్రజలు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే!

# ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు

**- మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్**



లాక్‌డౌన్‌ను మే 3వ తేది దాకా పొడిగించిన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ చెప్పారు. ఈనెల 14వ తేది రాత్రి నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో కరోనా మహమ్మారి వ్యాధి వ్యాప్తి నిరోధానికి అధికారులు తీసుకుంటున్న చర్యలను ఆయన సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కరోనా నివారణకు ప్రజలందరూ సహకరించాలన్నారు. లాక్‌డౌన్ పాటిస్తూ అందరూ ఇళ్ళలోనే ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, మాటిమాటికీ చేతులను సబ్బుతో కడుక్కుంటూ ఉండాలని, మాస్క్‌లు ధరించాలని, అందరూ భౌతిక దూరం పాటించాలని, కోరారు. రెడ్‌జోన్ ఉన్న ప్రాంతాల్లో మరోసారి రేషన్ సరుకులు అందజేస్తామని చెప్పారు. కరోనాతో నెల్లూరులో ఒక డాక్టర్ మృతిచెందడం బాధాకరమన్నారు. కరోనా కేసుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతం పాజిటివ్ వచ్చిన వారంతా ఇప్పుడు కోలుకుంటున్నారని చెప్పారు. కరోనా పరీక్షల్లో భాగంగా ఇప్పటిదాకా 1400 నమూనాలు సేకరించడం జరిగిందని, రెండురోజుల్లో మరో 800 మందికి పరీక్షలు చేస్తారని ఆయన అంటూ కరోనా లక్షణాలు ఎవరికైనా ఉంటే తక్షణం సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు, ఎస్పీ భాస్కర్ భూషణ్, కార్పొరేషన్ కమిషనర్ మూర్తి, జడ్పీ సిఇఓ సుశీల, డిఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

# కరోనా చికిత్సకు అందుబాటులో పూర్తి వైద్యం

**- కలెక్టర్ వెల్లడి**



నెల్లూరు జిల్లాలో పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్, ఎన్-95 మాస్కులు, శానిటేషన్ లిక్విడ్, వెంటిలేటర్లకు ఎలాంటి కొరత లేదని, రీజినల్ కోవిడ్ సెంటర్ జి.జి.హెచ్‌తో పాటు అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ కోవిడ్ -19 బాధితులకు చికిత్స అందించడానికి వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉన్నారని కలెక్టర్ యం.వి.శేషగిరిబాబు తెలిపారు. నెల్లూరు నగరంలోని నూతన జిల్లా పరిషత్ సమావేశ ప్రాంగణంలోని డి.ఈ.ఓ.సి నందు మీడియాతో మాట్లాడిన కలెక్టర్, కరోనా వైరస్ అనుమానిత లక్షణాలు ఉన్న వారికి వేగవంతంగా చికిత్స అందించే ట్రూనాట్ మెషిన్స్ అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. వీటి ద్వారా ర్యాపిడ్ టెస్టులను 50 నిమిషాల్లో చేయవచ్చని, దీనివల్ల కోవిడ్-19 పాజిటివ్ కేసులను త్వరగా గుర్తించి, నివారణ చర్యలను వేగంగా తీసుకోవచ్చన్నారు.

రీజినల్ కోవిడ్ సెంటర్ జి.జి.హెచ్ నందు 93 వెంటిలేటర్లు, నారాయణ మెడికల్ ఆస్పత్రిలో 17 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. జి.జి.హెచ్ నందు మరో 17 వెంటిలేటర్లు సాంకేతిక సమస్యల కారణంగా పని చేయడం లేదని, వీటిని త్వరగా మరమ్మత్తు చేస్తామని, ఒకవేళ అవి పనిచేయకపోతే వాటి స్థానంలో కొత్తవి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. విదేశాల నుంచి వచ్చిన ఎన్.ఆర్.ఐలను హోం ఐసోలేషన్‌లో ఉంచుతున్నామని, వారిలో ఎవరైనా 28రోజులు దాటి హోం ఐసోలేషన్‌లో ఉంటే వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, నెగిటివ్ రిజల్ట్ వస్తే హోం ఐసోలేషన్ వారికి అవసరం లేదని అధికారులకు తెలిపామన్నారు.


నెల్లూరు జిల్లాలో కురిసిన అకాల వర్షాల ప్రభావంతో వరి, ఉద్యాన వన పంటలకు కొంతమేర నష్టం వాటిల్లిందని, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు జిల్లాలో పర్యటించి మండలాల వారీగా ఎంత పంట నష్టం కలిగిందనే నివేదికను ఇవ్వాలని ఆదేశించామన్నారు. లాక్‌డౌన్ నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని, సామాజిక దూరాన్ని పాటించాలన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# కరోనా వ్యాక్సిన్.. మన చేతుల్లోనే ఉంది

(మొదటి పేజీ తరువాయి)



## మహమ్మారి కాదు.. భద్రకరి!

ముందుకు సాగేముందు ఒక విషయం స్పష్టంగా చెప్పదలిచాను. ఈ కరోనాను ఒక మహమ్మారిగా మాత్రమే చూసి దానిపై ఆగ్రహం వ్యక్తం చేయకండి. ఎందుకు వచ్చిందని కుమిలిపోకండి, భయపడకండి. జాగ్రత్త వుండాలి తప్ప భీతి వుండకూడదు. ప్రతీ విపత్తు మనకు ఒక అవకాశంగానే పరిణమిస్తుంది. ప్రపంచయుద్ధాలు వచ్చినపుడు ఎన్నో సాంకేతిక ఆవిష్కరణలు జరిగాయి. ఇలాంటి మూకుమ్మడి అంటువ్యాధులు ప్రబలినపుడే మందులు, టీకాలు కనిపెట్టగలిగారు. ఇది ప్రకృతి మనకు విసిరే సవాలు. దీన్ని అందుకుని ఆయుధంగా మలచుకోవాలి. గుర్తు పెట్టుకోవాల్సిన దేమిటంటే ప్రకృతి సైతం మనల్ని రక్షిస్తూనే వుంటుంది. దారి తప్పినపుడు చెవి మెలేసి పాఠాలు చెపుతుంది. లేకపోతే మనలో గర్వం పెరిగి, ప్రకృతితో చెలగాటమాడడం మొదలెడతాం.

ధర్మానికి గ్లాని కలిగినపుడు అవతారమెత్తి ధరిత్రిని కాపాడతానన్నాడు గీతాకారుడు. ఆ అవతారం మత్స్యమో, వరాహమో కానక్కరలేదు. గబ్బిలం ద్వారా సంక్రమించే క్రిమికీటకమే కావచ్చు. ఏ రూపంలో వచ్చినా మనకు గుణపాఠం చెప్పడానికే వచ్చిందనే భావించాలి. ఇప్పుడు కరోనా మన కాళ్లూ, చేతులూ కట్టేసి, యింట్లో కూలేసి మరీ పాఠాలు చెపుతోంది. దీని దృష్టిలో గొప్పా, బీదా తేడా లేదు, ప్రధాని భార్య, పనిమనిషి భర్త అనే భేదం లేదు. అమెరికా, ఆఫ్రికా అనే వ్యత్యాసం చూపటం లేదు. అభివృద్ధి చెందాయనుకున్న దేశాలు, చెందుతున్నాయనుకున్న దేశాలు, ఎప్పటికీ చెందవని మాటపడ్డ దేశాలు–అందరికీ సమంగా వడ్డిస్తోంది. బలవంతుల మాకేమని అహంకరించిన వారికి మరి కాస్త ఎక్కువగానే వడ్డిస్తోంది. అమెరికాను చూస్తున్నాంగా!

కరోనా ప్రపంచం మొత్తాన్ని ఒక 'కరక్షన్ మోడ్'లోకి తెచ్చి కూర్చోపెట్టింది. 'తమ ప్రజల్ని కాపాడుకోలేక టీకాల కోసం, మందుల కోసం మా దగ్గర ముష్టెత్తే దేశం, మేం టెక్నాలజీ ఊరికే యిచ్చినా అర్థం చేసుకోలేని దేశం' అని యీసడించిన దేశాన్నే 'మందులిచ్చి మా ప్రజలను కాపాడండి' అని నయానా భయానా అడిగేలా అగ్రదేశాల మెడలు ఒంచింది. మానవాళిని సరిదిద్దడానికి ఈ రూపంలో వచ్చింది. విచ్చలవిడిగా విహరించే ప్రజల పాలిట చిచ్చరపిడుగై హడలెత్తించింది. తరతరాలనాటి సంప్రదాయమే సంక్షోభాన్ని దాటే తరణోపాయం అని నొక్కి చెప్పింది. ఇది మహమ్మారి కాదు, అనాచారాల పట్ల కన్నెర్ర చేసి, తన బిడ్డల్ని అదలించి, అంతిమంగా కాపాడే భద్రకరి అమ్మవారు!

దీని నుంచి ఏయే దేశం ఏయే గుణపాఠాలు నేర్చుకుంటుందో, వాటిని ఎంతవరకు అమలు చేస్తుందో మనకు తెలియదు కానీ మన దేశానికి సంబంధించి మనం ఏం చేయాలో మాట్లాడుకుందాం. ఇవేమీ కొత్త విషయాలు కావు. పాతవే పునశ్చరణ చేసుకుంటున్నామంతే. 'గతంలోకి ముందడుగు' అనే పేరడాక్స్ వుంది. మనం ముందుకి వెళ్లాలంటే, ప్రగతి సాధించాలంటే ఓసారి వెనక్కి తొంగి చూడాల్సిందే. చాదస్తం అని అటకెక్కించిన వాటిని దింపి, దుమ్ముదులిపి మళ్లీ అలవాటు చేసుకోవలసినదే. కరోనా పుణ్యమాని మన 'నమస్తే' సంప్రదాయానికి అందరూ దణ్ణాలు పెడుతున్నారు. ఈ సంక్షోభం నుంచి అతి తక్కువ నష్టాలతో మనం బయట పడితే, మన తక్కిన అలవాట్లపై కూడా దృష్టి సారించి, వాటిని సొంతం చేసేసుకోగల ఘనులు వారు. ఇప్పటికే యోగాను అలవర్చేసుకున్నారు. అందువలన వారి కంటే ముందే మనం మేల్కొందాం.

## ఆరోగ్యమే మహాభాగ్యం అంటే యిదేగా!

"ఆరోగ్యమే మహాభాగ్యం" – చిన్నప్పటి నుంచి వింటున్న మాటే ఇది. బడి గోడలమీద కూడా రాసి మనను హెచ్చరించారు. అవి ఉత్తుత్తి మాటలు, డబ్బుంటే చాలనుకున్నాం యిన్నాళ్లూ. ఇప్పుడు తెలిసిందిగా, ఆరోగ్యం లేకపోతే నిలువెత్తు ధనం ఉన్నా పనికి రాదని! కరోనా భయంతో ధనికులు కూడా గడప దాటడం లేదు. అధికారమదం, ధనమదం ఏదీ కరోనా ముందు పనికి రావటం లేదు. అగ్రరాజ్యాల వద్ద అన్ని అణ్వస్త్రాలు న్నాయి, ప్రజలను కాపాడడానికి యిప్పుడేమైనా ఉపయోగపడ్డాయా? తన దేశపౌరులు పిట్టల్లా రాలిపోతుంటే, గుట్టలగుట్టల శవాలుగా మారి పోతుంటే పాలకులు నిస్సహాయంగా గుడ్లప్పగించి చూస్తున్నారు. అమ్మా నాన్నలకు కనీసం అంత్యక్రియలైనా చేయడానికి లేక, చేసే మనుషులు రాని దుస్థితిలో ఎంత డబ్బున్నా ఏంలాభం అని వగస్తున్నారు వారి పిల్లలు.

యుద్ధమనేది ఎప్పుడో వస్తుంది. అప్పుడు అవసరం పడుతుందంటూ – శత్రుదేశానికో, మాట వినని దేశానికో బుద్ధి చెప్పడం కోసమంటూ మిలియన్ల, బిలియన్ల డాలర్ల ప్రజాధనం ఖర్చు పెట్టి యుద్ధవిమానాలు, క్షిపణులు, ట్యాంకర్స్ కొని దాచుకున్నారు. పేదలకు వైద్యసదుపాయాలు సమకూర్చడం దండగమారి వ్యవహారమనుకున్నారు. ఎలాగోలా వారి సంఖ్య తగ్గితే అదే మేలనుకున్నారేమో తెలియదు. కానీ యిప్పుడేమైంది? అంటు వ్యాధికి ఆర్థికస్తోమతో సంబంధం లేదని తేలింది. ఇప్పుడే మిస్సైల్స్ ఎన్ని ప్రాణాలను కాపాడగలుగుతాయి? యుద్ధమంటే మారణాయుధాలతో జరుగుతుందనే భ్రమలోంచి బయటకు వస్తే మంచిది. కరోనాను బయోవెపన్ (జీవాయుధం)గా కొందరు అనుమానిస్తున్నారు, మరి కొందరు అదేమీ కాదంటున్నారు. నిజానిజాలు ఎప్పటికీ బయటకు రాకపోవచ్చు.

## యుద్ధాల కంటే ప్రమాదకరమైనవి వైరస్‌లు...

కానీ ఒకటి మాత్రం నిజం. యుద్ధం వస్తే ఒక దేశం ఆర్థికస్థితి ఆర్నెల్ల పాటు వెనకబడవచ్చు, మహా అయితే ఏడాది పాటు. ఈ కరోనా దెబ్బకు కొన్నేళ్లపాటు వెనకపడవచ్చంటున్నారు. శత్రువు తన యింట్లోంచి కాలు కదపకుండా మనల్ని చావుదెబ్బ కొట్టినట్లే. ప్రస్తుతం ఇది బయోవెపన్ కాకపోవచ్చు, కానీ యీ అనుభవం తర్వాత మరో శత్రుదేశానికి యీ ఐడియా రావచ్చు కదా. కరోనా కాక మరో 'నరోనా' మనపై వదలవచ్చు. అప్పుడేం చేస్తాం? అందువలన మనం తెలుసుకోవలసినదేమిటంటే, ఏమొచ్చినా ఎదుర్కోవాలంటే ఒక్కటే ఉపాయం – మనలోని రోగనిరోధక శక్తిని పెంచుకోవడం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం. శరీరాన్ని ఓ కంచుకోటగా తయారుచేసి పెట్టుకుంటే అవతలివాడు కత్తులు వాడినా, శూలాలు వాడినా, తుపాకీలు వాడినా చెక్కు చెదరదు. అందువలన సరిహద్దుల రక్షణ కోసం బోల్డంత డబ్బు తగలేసే బదులు, శరీర రక్షణ కోసం దానిలో కొంతలో కొంత ఖర్చు పెడితే మంచిది.

దురదృష్టవశాత్తూ మన పాలకులకు ఆ దృష్టి లోపించింది. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో నెహ్రూగారు అలీనవిధానం పాటించి, పంచశీల ప్రతిపాదించి, యిరుగుపొరుగులతో శాంతి కోసం ప్రాకులాడి, రక్షణవ్యయం తగ్గించి, దాన్ని యిరిగేషన్ ప్రాజెక్టులకు, దేశనిర్మాణానికి, శాస్త్రసాంకేతిక రంగాలకు కేటాయించారు. అయితే 1963లో చైనా మన నమ్మకాన్ని వమ్ము చేసి దాడి చేసింది. మన వద్దనున్న ఆయుధాలు కాలం చెల్లినవని, సైనికులకు సరైన తర్ఫీదు లేదని, శాంతిదూత బిరుదుకోసం నెహ్రూ దేశభద్రతపై రాజీ పడ్డారని దుమ్మెత్తిపోశారు. ఇక అప్పట్నుంచి రక్షణ రంగంపై ఖర్చు పెట్టడం రివాజైంది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన ఆయుధాలను త్రోసిరాజని, కోట్లాది రూపాయలు పెట్టి అవసరం ఉన్నా లేకపోయినా, ఏటేటా విదేశీ ఆయుధాలు కొనడం, కొన్నాళ్లకు పాకిస్తాన్ అంతకంటే మెరుగైన ఆయుధాలు కొన్నది కాబట్టి పోటాపోటీగా యింకా ఆధునికమైన ఆయుధాలు కొనాలంటూ, వీటిని మూలపడేసి మళ్లీ కొత్తవి హెచ్చుధరకు కొనడం సాగుతోంది.

ఈ 72 ఏళ్లల్లో మనం చేసిన యుద్ధాలు ఒక చేతివేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. కానీ బడ్జెట్‌లో హెచ్చుభాగం దానికే పోతోంది. అగ్రదేశాలు తమ ఆయుధాల అమ్మకం నిరంతరంగా కొనసాగేందుకు ప్రపంచమంతా యిరుగుపొరుగు దేశాల మధ్య నిప్పు రాజేస్తూ యుద్ధరతికి ఆయుధాలు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటూ వచ్చాయి. డిఫెన్సు లావాదేవీల్లో అధికార పార్టీకి ముడుపులు దక్కడం, వాటి గురించి ప్రశ్నించిన వారిని దేశద్రోహులుగా ముద్రవేయడం ఆనవాయితీగా జగమంతా జరుగుతున్న భాగోతం. అందువలన అనేక బడుగు దేశాలు తమ ఆదాయంలో సింహభాగాన్ని రక్షణకై వెచ్చిస్తూ కనీస మౌలికసదుపాయాలను నిర్లక్ష్యం చేస్తూ ఎప్పటికీ వెనకబడే వుంటున్నాయి.

భారతదేశం కూడా యిదే బాటలో నడుస్తోందని మనం గమనించవచ్చు. మనం కోత పెడుతున్నది అత్యవసరమైన విద్య, వైద్యరంగాలకు. ఏటేటా డిఫెన్స్ బడ్జెట్ పెరుగుతుంటే విద్య, వైద్య రంగాల బడ్జెట్ తరుగుతూ వస్తోంది. రాజకీయంగా బలం లేనివారిని విద్యామంత్రిగా, వైద్యమంత్రిగా నియమించడం ఆనవాయితీ అయింది. వారు తమ శాఖలకు తగిన నిధులు కేటాయించమని అడగలేని నిస్సహాయులవుతున్నారు.

## విద్య, వైద్య, పరిశోధనా రంగాలకు ప్రాధాన్యత కల్పించాలి

ఆరోగ్యం అనగానే వైద్యసదుపాయాలు అమరిస్తే చాలు కదా అనుకుంటారు. అంతకంటే విద్య ముఖ్యం. విద్య ఉంటే అనేకం సమకూడుతాయి. ఉద్యోగం, ఆదాయం, తద్వారా మెరుగైన వైద్యం పొందే అవకాశం వస్తాయి. అంతేకాదు, విద్య పెరిగినకొద్దీ మతమౌఢ్యం తరిగి కరోనా సమయంలో జరిగిన దురదృష్టకర సంఘటనలు జరగకుండా వుంటాయి. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు బాగున్నపుడే ఆ రాష్ట్రం లేదా దేశం పరిస్థితి బాగుందని చెప్పుకోవాలి. దురదృష్టవశాత్తూ ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేసేసి చేతులు దులుపుకుంది. ఏ దేశమైనా ముందుకు వెళ్లాలంటే సైన్సు, టెక్నాలజీ అభివృద్ధి చెందాలి. వాటికి సంబంధించిన పరిశోధనలు యూనివర్శిటీల్లో, ప్రభుత్వ రిసెర్చి సెంటర్లలో విరివిగా జరగాలి. వాటిని పరిశ్రమలు అందిపుచ్చుకుని, ఆచరణలో సాధ్యం చేసి, సామాన్యులకు అందించాలి.

అయితే ప్రస్తుతం జరుగుతున్నదేమిటి? విశ్వవిద్యాలయాలను ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. పరిశోధనలకు నిధులివ్వదు. శాస్త్రజ్ఞులకు ప్రోత్సాహమివ్వదు. దానితో వాళ్లు విదేశాలకు వలస పోతున్నారు. సరైన అధ్యాపకులు లేరు, అనేక యూనివర్శిటీలకు వైస్‌ఛాన్సలర్లు సైతం లేరంటే విస్తుపోతాం. ప్రొఫెసరుకి ఏ మాత్రం ప్రతిభ వున్నా కార్పోరేటు కళాశాలల వారు ఎగరేసుకుని పోతున్నారు. అనేక వైద్యకళాశాలల్లో బోధనాసిబ్బంది లేరు. ఎందుకంటే ఒక మంచి వైద్యుడికి ప్రొఫెసర్‌గా పాఠాలు చెప్పేకంటే, ప్రాక్టీసు చేసుకుంటే కార్పోరేట్ ఆసుపత్రిలో ఉద్యోగిగా లేదా భాగస్వామిగా చేరితే ఎక్కువ లాభసాటిగా వుంది. ఉపాధ్యాయుడే లేనప్పుడు విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అబ్బుతుంది?

పేరున్న యూనివర్శిటీలలో కూడా పరిశోధనలు తగినంతగా జరగటం లేదు. గ్లోబలైజేషన్ తర్వాత పరిశ్రమలు సొంత పరిశోధనాలయాలను మూసివేసి, దిగుమతుల మీదే ఆధారపడ్డారు. పరిశోధనలు చేపట్టిన పరిశ్రమలకు ప్రభుత్వం తగినంతగా నిధులు, ప్రోత్సాహకాలు సమకూర్చటం లేదు.

ఇక ప్రభుత్వ ఆసుపత్రుల వద్దకు వస్తే ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. వైద్యులు లేరు, నర్సులు లేరు, మందులు లేవు, పడకలు లేవు, వసతులు లేవు, ఎక్విప్‌మెంట్ లేదు, రోగులు తిరగబడ్డారు, ఎమ్మెల్యేలు డాక్టర్లను కొట్టారు, జూనియర్ డాక్టర్లు సమ్మె చేశారు.. ఎప్పుడు చూసినా యివే కదా వార్తలు! ఇక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైతే చెప్పనే అక్కర్లేదు. ఏవీ వుండటం లేదు. వీటిని ఎండగట్టి పేషంట్లను ఆరోగ్యశ్రీ పేరుతో కార్పోరేట్ల ఆసుపత్రులకు తోలుతున్నారు. అంటే ప్రభుత్వం తన ఆసుపత్రుల నిర్వహణ విషయంలో వైఫల్యాన్ని తనే ఒప్పుకున్నట్లయింది. ఈనాడు కరోనా రాగానే హఠాత్తుగా ప్రభుత్వ ఆసుపత్రుల అవసరం అందరికీ గుర్తుకు వచ్చింది. ఇన్నాళ్లూ నిర్లక్ష్యం చేయబడి, యిప్పటికిప్పుడు ఇంద్రజాలికుడి మట్టిచెట్టులా హఠాత్తుగా ఎదిగి నీడ నివ్వాలంటే వాటికి సాధ్యమా?

కార్పోరేట్ ఆసుపత్రులు వైద్యసేవల నందిస్తున్నాయి. కానీ సామాన్యుడికి అవి భారమౌతున్నాయనే ఫిర్యాదు వుంది. హైదరాబాదులో అనేక ఔషధపరిశ్రమలున్నా మందుల ధరలు చాలా ఎక్కువగా వుంటున్నాయన్న ఫిర్యాదు కూడా వుంది. శాంతా బయోటెక్నిక్ వంటి దేశీయ సంస్థలు చౌకధరలకు మందులు, టీకాలు అందించాయి. కానీ దూరదృష్టి లోపించిన ప్రభుత్వం ఔషధ సంస్థల్లో కూడా నూటికి నూరు శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించడంతో అవి విదేశీ పెట్టుబడుదారుల చేతుల్లోకి వెళ్లిపోయి, వారి విధానాలకు అనుగుణంగా, వ్యాపారధోరణికి అనువుగా పని చేసే పరిస్థితి వచ్చింది. కార్పోరేట్ ఆసుపత్రుల విషయంలోనూ అదే జరుగుతోంది. ప్రభుత్వం తన ఆసుపత్రుల ద్వారా ఉచిత వైద్యం అందించలేదు సరికదా, తన విధానాల వలన ఔషధాలు సరసమైన ధరలకు లభించే అవకాశాన్నీ చెడగొట్టింది. ఇప్పుడు అందరూ గగ్గోలు పెడుతున్నారు.

వెంటిలేటర్స్ వంటి వైద్యపరికరాలు, టెస్టింగ్ కిట్స్, టెస్టింగ్ లాబ్స్ లేవని యిప్పుడు అందరూ గోల పెడుతున్నారు. పరీక్షలు నిర్వహించే సామగ్రి లేకపోబట్టే మన దేశంలో కరోనా వ్యాధిగ్రస్తుల సంఖ్య ఖరారుగా తెలియటం లేదని యావత్ప్రపంచం వ్యాఖ్యానిస్తోంది. మరి వీటి మీద పాలకులు ఎందుకు శ్రద్ధ పెట్టలేదు? ఇప్పటికిప్పుడు యివన్నీ కావాలంటే పుట్టుకుని వస్తాయా? వచ్చినా వాటి నాణ్యత గురించి గ్యారంటీ వుందా? దాహమయ్యాక బావి తవ్వడానికి పూనుకుంటున్నామని అర్థమైంది కదా. ఈ స్థితికి కారకులెవ్వరు? పాలకులు! వారిని ఎన్నుకుని, వారేం చేసినా ఊరుకుంటున్న మనలాంటి నిస్తబ్ద, నిస్తేజ పౌరులం! 'మా ప్రాణాలకు ముప్పు వస్తోంది. మీ ప్రాధాన్యతాక్రమాన్ని మార్చుకోండి, లేకపోతే సహించం' అని ముక్తకంఠంతో మనం ఎలుగెత్తి చెప్పాల్సిన సమయం వచ్చింది. 'దేశానికి కావల్సినది అణ్వస్త్రాలు కాదు, అన్నవస్త్రాలు' అన్నాడు శ్రీశ్రీ. ఈనాడు మనం 'ఔషధాలు, వైద్యులు' అని చెప్పవలసిన అవసరం వచ్చింది.

తగినంతమంది వైద్యులు తయారుకాకపోవడంలో పౌరసమాజం పాత్రా వుంది. దానిలో నేనూ, మీరూ అందరం బాధ్యులమే. రాష్ట్రంలో పుట్టెడు ఇంజనీరింగు కాలేజీలుంటే కేవలం పుంజీడు మెడికల్ కాలేజీలుంటున్నాయి. కంప్యూటరు ఒక్కటి వుంటే చాలు, వ్యవసాయం అక్కరలేదు, వ్యాపారం అక్కరలేదు, పరిశ్రమలు అక్కరలేదు, అమెరికా వెళ్లి డాలర్లు నొల్లుకుని వచ్చేయచ్చు అనుకునే ఆలోచనాధోరణిని పాలకులు ప్రోత్సహించి సమాజాన్ని అలా పోతపోశారు. దాంతో ప్రజలు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి బేసిక్ ఇంజనీరింగ్ శాఖల్ని కూడా మూలపడేశారు. నాలుగురాళ్లు పోగేసుకోవాలంటే వాళ్లూ కంప్యూటర్స్‌లోకి వచ్చేయాల్సిన అగత్యం కల్పించారు. ఇప్పుడు కరోనా నుంచి ఏ కంప్యూటర్ రక్షించింది? ఇన్నాళ్లూ కంప్యూటర్ వైరస్ గురించే బెంగపెట్టుకున్నవారు ఈనాడు సజీవమైన వైరస్ రంగంలోకి దిగేసరికి బెంబేలెత్తుతున్నారు.

మెడికల్ కాలేజీ పెట్టాలంటే వసతులుండాలి, బోధక సిబ్బంది వుండాలి, తోడుగా ఆసుపత్రి వుండాలి. అనుమతి తెచ్చుకోవడం భగీరథ ప్రయత్నమే. అందుకని వాటి జోలికి వెళ్లటంలేదు. దాంతో మెడికల్ కాలేజీ సీటంటే గగనకుసుమం అయిపోయింది. కోటి, రెండు కోట్లు ఖర్చు పెడితే తప్ప ఎంబిబిఎస్ పూర్తవటం లేదు. దానితో ప్రభుత్వోద్యోగం రాదు. కార్పోరేట్లయితే 25 వేల లోపు స్టయిపెండ్‌తో సరిపెడుతున్నారు. అది ఓ కంప్యూటర్ ఆపరేటర్‌కు వచ్చే జీతం కంటే తక్కువుంటోంది. దాంతో పోస్టు గ్రాడ్యుయేషన్‌కి వెళుతున్నారు. అదో రెండు కోట్ల ఖర్చు. ఇంత ఖర్చు పెట్టి, లేటుగా ఆర్జన మొదలుపెట్టాక మరి ఫీజులు భారీగా తీసుకోక డాక్టర్లకు తప్పుతుందా? దాంతో కన్సల్టేషన్ భారం, అనవసరమైన టెస్టులు భారం, మందులు భారం – వీటన్నిటితో డాక్టరు దగ్గరకు వెళ్లాలంటేనే సామాన్యుడు జంకుతున్నాడు. అస్వస్థత కలిగినా మందులషాపు వాడిచ్చిన బిళ్లలు మింగుతున్నాడు. గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెచ్చుకుంటున్నాడు.

మెడికల్, నర్సింగ్ కాలేజీలు పెంచమని, వైద్యుల, నర్సుల సంఖ్య పెంచమని మనం ప్రభుత్వాన్ని పట్టుబట్టాలి. మా పట్టణానికి వైద్యకళాశాల శాంక్షన్ చేయండి అని ప్రజాప్రతినిధులను డిమాండ్ చేయాలి. సామాన్య కుటుంబాల నుంచి కూడా ఎందరో ఇంజనీర్లు తయారయ్యారు. అదే విధంగా డాక్టర్లు కూడా తయారు కావాలని మనం కోరుకుని ఆ దిశగా కృషి చేయాలి.

అంతేకాదు, వారు పనిచేసేందుకు ఆసుపత్రులు కూడా కావాలి. ప్రాకృతికంగా లేక మానవ ప్రేరితాలుగా కరోనా వంటి ఇంకెన్ని అంటు వ్యాధులు వస్తాయో తెలియదు కాబట్టి జిల్లాకు 200 పడకల ఐసోలేషన్ వార్డులు కట్టి అత్యంత పరిశుభ్రమైన పరిస్థితుల్లో వాటిని మేన్‌టేన్ చేయాలి. ప్రతి పేషంటు రాష్ట్రరాజధానికి తరలిరానక్కరలేదు. జిల్లాకొకటి చొప్పున దేశమంతా కడితే చాలా ఖర్చవుతుందనవచ్చు. ఎంతైనా ఒక ఏడాది డిఫెన్సు బడ్జెట్ కంటె తక్కువే! కట్టినదాకా వుండి వ్యాధులు రాకపోతే యిదంతా వృథా కదా అంటారేమో, యుద్ధం వస్తే తయారుగా వుండాలి కదాని మనం సైన్యాన్ని మేన్‌టేన్ చేయడం లేదా? ఎప్పుడో నిప్పంటుకుంటుందేమోనని ఫైర్ డిపార్టుమెంటును నిర్వహించటం లేదా? అక్కడే మైంది యీ లాజిక్! ఇదంతా డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగానే చూడాలి. మన జీవనవిధానం మార్చుకుని రోగనిరోధకశక్తి పెంచుకునే లోపున యింకొన్ని వైరస్‌లు రావచ్చు. అప్పుడు హడావుడిగా, అరకొర సదుపాయాలతో క్వారంటైన్‌లు కట్టబోతే వాటి కారణంగా రోగాలు ప్రబలే ప్రమాదం ఉంది. ఇదే మనం సమకూర్చుకోగలిగిన మొదటి వాక్సిన్. ఈ వాక్సిన్ పాత, కొత్త, సరికొత్త – అన్ని రోగాలకూ పని చేస్తుంది. ఇక రెండో వాక్సినంటారా? అది వ్యక్తిగతమైంది.

## శౌచం – ఇది అన్నిటికన్నా శక్తివంతమైన వాక్సిన్

ధర్మదేవతకున్న నాలుగుపాదాల్లో శౌచం ఒకటని ధర్మరాజు చెప్పాడు. ఇది కలియుగం కాబట్టి తక్కిన సత్యం, అహింస, ఆస్తేయం వంటివన్నీ పోయి యిదొక్కటే మిగిలింది. మనం ఆ పాదాన్నే గట్టిగా పట్టుకుని మనల్ని మనం కాపాడుకోవాలి. శౌచం అంటే శుభ్రంగా వుండడం. శరీరాన్ని, మనసును, చుట్టూ ఉన్న సమాజాన్ని అన్నిటిని పరిశుభ్రంగా వుంచుకోవడం. ఇది అనారోగ్యాన్ని నిరోధించే ఉత్తమోత్తమ సాధనం. దీనికి మనం వాడేది నీరు. నీరు ఎక్కడుందా అని వెతుక్కుంటూ మానవాళి భూమంతా తిరగడం తోనే నదీతీరాల వెంబడి నాగరికతలు వర్ధిల్లాయి. అందువలన మనం నదీజలాలను కాపాడుకోవాలి. వాటిని పరిశుభ్రంగా వుంచాలి. శుద్ధి చేయవలసిన నీటినే కలుషితం చేస్తే యింక అదెక్కడ శుభ్రం చేస్తుంది? మనం నదులను పవిత్రంగా భావిస్తాం, పాపాలు పోతాయంటూ వాటిలో మునకలు వేస్తాం. అదే సమయంలో నానారకాల వ్యర్థాలను వాటిలో వదులుతాం. సామాజికపరంగా మనం చేస్తున్న తప్పు అదొక్కటే కాదు. బహిరంగ మలమూత్ర విసర్జన, ఎక్కడ పడితే అక్కడ చెత్త పారేయడం యిలాంటి దుర్లక్షణాలు ఎప్పటికి పోతాయో తెలియదు. మనమే విదేశాలు వెళ్లినపుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని ఉంటాం. అదే మన దేశానికి వచ్చేసరికి చెత్తడబ్బా దాకా వెళ్లడానికి బద్ధకిస్తాం. మన యిల్లు కాకపోతే చాలు, ఎంతైనా పాడుచేయవచ్చు అనే పద్ధతి పోవాలి. మనకు తగ్గట్టే పాలకులూ తయారయ్యారు. మన యిళ్లల్లోంచి సేకరించిన చెత్తను ఒక చోట దిమ్మరించి తమ పని అయిపోయిందనుకుంటారు. దాన్ని నిరపాయకరంగా ఎలా వదుల్చుకోవాలన్నది వారికి పట్టదు. ఎప్పుడో ఒకరోజు ఎవడో అగ్గిపుల్ల వెలిగించి పడేస్తాడు. దాంతో ఆ చుట్టుపక్కల కాలనీల్లో వారం రోజుల పాటు పొగ, దుర్గంధం, దగ్గులు, తుమ్ములు...! చాలా ఊళ్లల్లో చెత్త పడవేసే డంపింగ్ యార్డులు కూడా లేవు. చెరువుల్లో, కాలవల్లో, నదిలో పడేసి పోతారు. డ్రైనేజి సమస్య లేని ఊరే లేదని చెప్పవచ్చు. రోడ్డు మీది డ్రైనేజి పైపులు పగిలిపోయి, పొర్లిపోతూ వుంటాయి. అనేక నగరాల్లో డ్రైనేజి పైపులు, మంచి నీటి పైపులు కలిసిపోతూ వుంటాయి. ముఖ్యంగా అపార్టుమెంట్లు మొలుచుకుని వచ్చాక యీ సమస్య తీవ్రమైంది. ఫ్లాట్లు కట్టేటప్పుడు సూర్యరశ్మి లోపలికి వస్తుందా లేదా అని చూడకుండా కట్టే వాళ్లు కడుతున్నారు, అనుమతులిచ్చేవాళ్లు అనుమతులిస్తున్నారు. మనం సూర్యుణ్ని ఎందుకు ఆరాధిస్తాం? సూర్యుడు ఆరోగ్యాన్ని యిస్తాడు, క్రిములను పారద్రోలుతాడు కాబట్టి. ఇంట్లో వస్తువులకు బూజు పడితే ఎండలో ఆరబెడితే బాగుపడతాయి. ఆ ఎండ తగలకే యిప్పుడందరూ డి–విటమిన్ లోపంతో బాధపడుతున్నారు.

ఇల్లన్నాక వ్యర్థాలను వదుల్చుకోవడానికి మరుగుదొడ్డి అవసరం. ఊరన్నాక చెత్త పడవేసే డంపింగ్ యార్డు, దానిని డిస్పోజ్ చేసే యంత్రాంగం అవసరం. కానీ పాలకులు మర్చిపోతారు. పౌరులు పట్టించుకోరు. ప్రభుత్వస్థలమేదైనా ఖాళీగా కనబడితే పేదలకు యిళ్లస్థలాల కోసం అట్టేపెడదామంటుంది అధికారపక్షం. లబ్ధిదారులు చప్పట్లు కొడతారు. డంపింగ్ యార్డుల గురించి వారికి తోచదు, వీరడగరు. గ్రామాల్లో అయితే చెత్త ఎక్కడైనా పడేయవచ్చనుకుంటారు. నగరాల్లో, పట్టణాల్లో కొన్ని ప్రాంతాలను అందంగా వుంచడానికై ఊళ్లో చెత్తను పట్టుకెళ్లి శివార్లలో, పోరంబోకు భూముల్లో పడేస్తూంటారు. పక్కనే అక్రమంగా ఒక కాలనీ వెలుస్తుంది. కాలనీవాసులు, పిల్లలు ఆ యార్డులోనే పొర్లాడుతూంటారు. అనారోగ్యాల పాలవుతూంటారు. వాళ్ల ఖర్మాన వాళ్లే పోతారులే అని వూరుకుంటూ వచ్చాం. ఇప్పుడు కరోనా బుద్ధి చెప్పింది – వాళ్లను పట్టించుకోకపోతే వాళ్ల ద్వారానే నీకు సంక్రమిస్తుంది జాగ్రత్త సుమా అని. కూలీగా పనిచేసే ఆ కాలనీవాసుడి తుమ్ము తుంపర్లు పడిన వస్తువును షాపింగ్ మాల్‌లో కొని నీ ఏడంతస్తుల మేడకు తెచ్చుకుంటే కరోనా లక్ష్మికి నువ్వు హారతిచ్చి లోపలికి తీసుకువచ్చినట్లే! అందువలన మనమే కాదు, మన చుట్టూ ఉన్న సమాజం కూడా శుచిగా, శుభ్రంగా వుండేట్లు చూడాల్సిన అవసరం మనది.

ఇక వ్యక్తిగత శౌచానికి వస్తే యిది మొదటి నుంచి వున్నదే, యిటీవలే పట్టించుకోవడం మానేశాం. బయట నుంచి వస్తే, బాత్‌రూమ్‌కి వెళ్లి వస్తే, భోజనానికి ముందూవెనుకా కాళ్లూ, చేతులూ, మొహం కడుక్కో – అనేవి ఎవరైనా చెప్పాలా? తుమ్ము వస్తే రుమాలుతో ముక్కు కప్పుకో, దగ్గితే చెయ్యి అడ్డుపెట్టుకో అని కరోనా వచ్చాక టీవీల్లో సూపర్ స్టార్ల చేత చెప్పించుకోవడానికి సిగ్గుగా లేదా? ఇవి ప్రాథమికమైన నాగరికమైన విషయాలు కావూ? అన్నం పరబ్రహ్మస్వరూపం. భోజనం చేయడం యజ్ఞంతో సమానం. ఎక్కడపడితే అక్కడ, ఎలా పడితే అలా, బజార్లో తిరిగివచ్చిన దుస్తులతో తినకూడదు. అలా తింటే దేహరక్షణ వ్యవస్థ బలహీనమై, మనం రోగానికి సులభంగా లొంగిపోతాం.

పెళ్లిళ్లల్లో బఫే భోజనాలకు వెళ్లి వందలాదిమందికి షేక్‌హ్యాండ్‌లు యిచ్చి, హేండ్ వాష్ దూరంగా వుందని బద్ధకించి, అదే మురికి చేత్తో భోజనం చేసేవాళ్లు ఎందరో ఉన్నారు. చేశాక టిస్యూ పేపరుతో తుడిచేసుకుని, మళ్లీ కరచాలనాలు మొదలెట్టేవారు కొందరు. అసలు కరచాలనాలెందుకు, చేతులు జోడించి నమస్కారం పెట్టకుండా అవతలివాళ్లు ఆ చేతిని అంతకుముందు దేనికి ఉపయోగించారో మనకేమెఱుక? ఇది చాలనట్లు వాటేసుకోవడాలొకటి. భార్యనైనా సరే, బహిరంగంగా కౌగలించుకుంటే కళ్లెగరేసిన ఒకనాటి గొప్ప సమాజం మనది. అలాటిది యిప్పుడు ఆడా, మగా తేడా లేకుండా అందర్నీ 'హగ్' చేసుకునే స్థితికి వచ్చాం. అందుకే కరోనా మాయాబజారు శశిరేఖలా 'దూరం, దూరం' అంటోంది.

ఎవరిదైనా ఎంగిలి తినరావలసి రావడం ఖర్మగా భావించేవారు. ఎంగిలి ఐన కూడు పెట్టినందుకు ఋషులు శపించిన సందర్భాలున్నాయి. అలాటిది యిప్పుడు ఎంగిలి పాటిస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుపడాల్సిన విషయం అయిపోయింది. ఒకే ప్లేట్లో నలుగురు తినడం, ఒకే గ్లాసులోది అరడజను మంది తాగడం ఫ్యాషనై పోయింది. అవతలివాడికి ఏ రోగం ఉందో మనకు తెలుసా? వాడి లాలాజలం ద్వారా మనకు పాకదన్న గ్యారంటీ వుందా? అసలే ఫ్యాషన్ పేరుతో అందరూ పెరిగిన గడ్డాలతో, మురికి బట్టలతో బూచాళ్లలా తయారయ్యారు. రఫ్‌గా ఉంటేనే మ్యాన్లీగా ఉన్నట్లు అనుకుంటూ స్నానాలు మానేసి, డీయోడరెంట్ చల్లుకుని జనాల్లో తిరిగేస్తున్నారు. ఎప్పుడు నిద్రపోతారో, ఎప్పుడు తింటారో, ఎప్పుడు పళ్లు తోముకుంటారో తెలియదు. ఎక్కడ తింటారో ముందే చెప్పలేం. పెద్ద ఉద్యోగం చేస్తూ, కార్లలో తిరుగుతూనే రుచికోసం అంటూ రోడ్డు పక్క దుమ్మూధూళీలో పెట్టిన బళ్ల దగ్గర తింటారు. దాన్ని ఆధునిక జీవనశైలిగా అభివర్ణించుకుంటారు. వేళాపాళా లేని బతుకులు. అలాటివాడి ఎంగిలి ఆరోగ్యదాయకంగా ఉంటుందని చెప్పగలమా?

## మన వంటిల్లే.. మనకు ఔషధాలయం

తిండి దగ్గరకు వచ్చాం కాబట్టి దాని గురించి మరింతగా మాట్లాడుకోవాలి. మనకు వంటిల్లే ఔషధాలయం. సుగంధ ద్రవ్యాల పేరుతో మనం వాడే దినుసులన్నీ శరీరానికి ఎంతో మేలు చేసేవి. ఉల్లి, వెల్లుల్లి, అల్లం, పసుపు, వాము, శొంఠి, మెంతులు, మిరియాలు, ఆవాలు, ఏలకులు, లవంగాలు, దాల్చిన చెక్క.. యిలాటివన్నీ ఎందుకు పనిచేస్తాయో నేను విడివిడిగా చెప్పనవసరం లేదు. ఇంటివైద్యం, చిట్కాలు తెలిసిన ప్రతి గృహిణికి తెలుసు. పోపులపెట్టెయే ఆవిడ మందులషాపు. వీటికోసమే గతంలో పాశ్చాత్య దేశాల వాళ్లు మన దేశాలకు వచ్చి, అంతిమంగా మన నెత్తికెక్కారు. అంత సంపద మన దగ్గర పెట్టుకుని, యివేమీ లేని పిజ్జాలు, బర్గర్ల కోసం మనం వెంపర్లాడడం, రోగనిరోధక శక్తిని నాశనం చేసుకోవడం మూర్ఖత్వం కాదా?

మన నివసించే పద్ధతి ఎలాటిది? ఇంటి ముంగిట వేపచెట్టు యాంటీ యాక్సిడెంట్లు యిస్తుంది. మామిడి చెట్టు ధారాళంగా ఆక్సిజన్ యిస్తుంది. కర్పూరం వెలిగిస్తే, ఆవుపిడకలు కాలిస్తే రోగక్రిములు నశిస్తాయి. ఇక వండుకునే విధానం ఎలాటిది? పెరట్లోని దొండపాదు దొండకాయలిస్తుంది, మునగచెట్టు ములక్కాడలిస్తుంది, కరివేపాకు చెట్టు కరివేపాకు యిస్తుంది, కొత్తిమీర మడి కొత్తిమీర యిస్తుంది. తాజా కూరలతో వంట తయారవుతుంది. పోపులపెట్టె సహాయంతో వేడివేడి చారు తయారై కఫం అణచేస్తుంది. అంతా తాజాతాజాగా, వేడివేడిగా, అప్పటికప్పుడు వండుకుని తింటాం.

పాశ్చాత్యులదంతా డబ్బా తిళ్లు. ఎప్పుడో వండి, డబ్బాల్లో కుక్కితే అది సూపర్ మార్కెట్ అరల్లో మగ్గిమగ్గి, వీళ్లింటికి వచ్చి యింకొన్నాళ్లు మగ్గి అప్పుడు నోట్లోకి వస్తుంది. అది వేడిగానూ వుండదు, తాజాగానూ ఉండదు. ఖర్మ కొద్దీ మనం అలాటి తిళ్లకు అలవాటు పడుతున్నాం. కంటికెదురుగా ఉన్న నవనవలాడే పండు ఒలుచుకుని తినకుండా, అట్టపెట్లో వచ్చిన ఫ్రూట్ జ్యూస్ తాగుతున్నాం. 'దీనిలో ఏ పళ్లరసమూ లేదు, ఉన్నవి కేవలం పంచదార నీళ్లు, ఆ పండుతాలూకు ఫ్లేవర్ యిచ్చే కెమికల్ మాత్రమే' అని రాసినా ఖాతరు చేయటం లేదు. ఇవి అసలు దినుసు కంటె కొన్ని రెట్లు ఖరీదెక్కువని తెలిసినా పట్టించుకోవడం లేదు. ఈ ఫుడ్ ప్రాసెసింగ్‌లో అసలైన చిక్కు, నిలవ వుంచేందుకు వాడే ప్రిజర్వేటివ్ కెమికల్స్, నదురుగా కనిపించేందుకు వాడే రంగుల వలన వస్తుంది. ఆహారపదార్థాల్లో కూడా అవి వాడి దుష్పరిణామాలు కొని తెచ్చుకోవడం దేనికి? ఇటీవల నిలువ చేసిన దోసె పిండి సూపర్‌మార్కెట్‌లో విపరీతంగా అమ్ముడుపోతోంది. ఇంట్లో మిక్సీలున్నా, రుబ్బుకునే గ్రైండింగ్ మెషిన్లున్నా రెడీమేడ్ పిండిని కొనడంలో విజ్ఞత ఏమిటో మనకు మనమే ప్రశ్నించుకోవాలి. ఇంట్లో వండకుండా బయట నుంచి పిజ్జాలు ఆర్డరు యిచ్చుకోవడం దేనికి? వాడు శుభ్రంగా, ఆప్యాయంగా, తల్లిప్రేమ రంగరించి వండుతున్నానని చెప్పాడా?

ఎంతో ఎదిగిపోయామనుకున్న అమెరికా, యూరోప్ దేశాలు ఈరోజు మనని అడిగి మందులు తీసుకుంటున్నాయి. భారతీయ ఔషధాలే కాదు, భారతీయ వంటకాలు కూడా వాళ్లు ఒంటపట్టించుకోవాలి. తాజావి, పూర్తిగా ఉడికించినవి తినడం నేర్చుకోవాలి. ఎప్పుడో ఒకసారి ఇండియన్ రెస్టారెంటుకి వెళ్లి లొట్టలేసుకుంటూ తినడం కాకుండా, మన పోపులపెట్టెను వాళ్ల కిచెన్‌లో పెట్టుకోవాలి. వాళ్ల బాగోగులు మనకెందుకు అనకండి, గ్లోబలైజేషన్ తర్వాత ప్రపంచం ఒక కుగ్రామం అయిపోయిందని కరోనా మరొక్కమారు గుర్తు చేసింది కదా! వాళ్ల ఆరోగ్యమే మన మహాభాగ్యం. మన ఆరోగ్యమే వాళ్ల భాగ్యం. ఇక శాకాహారం, మాంసాహారం మాటకు వస్తే మనిషి నిర్మాణం మాంసాహారానికి అనువైనదే అంటున్నారు కానీ జీవపర్యావరణ చక్రాన్ని అస్తవ్యస్తం చేస్తూ కనబడే ప్రాణులన్నిటినీ తినడం ప్రాణాంతకమని కరోనా మరోసారి గుర్తు చేసింది. శాకాహారం అందరికీ మంచిదే కానీ మాంసాహారం కష్టజీవులకు మాత్రమే, అదీ ఒక వయసు వరకే మంచిదని శాస్త్రీయంగా తెలుస్తోంది. శారీరక శ్రమ పెద్దగా లేనినాడు మాంసం తినడం, దాన్ని అరిగించుకోలేక అష్టకష్టాలు పడడం శరీరాన్ని రొష్టు పెట్టినట్లే. పైగా శుచీ, శుభ్రతా అంతగా లేని యీ సమాజంలో, సహజపద్ధతుల్లో కాకుండా కృత్రిమంగా కోడిగుడ్లను, అసహజంగా కోళ్లను తయారుచేస్తున్న యీ రోజుల్లో సాధ్యమైనంత వరకు మాంసాహారానికి దూరంగా వుండడమే మేలని నా సలహా.

శరీరం బాగుండాలంటే మనసు కూడా బాగుండాలి. రెండూ పరస్పరాశ్రితాలు. మనసు బాగాలేక శరీరానికి వచ్చే వ్యాధులను సైకో–సొమాటిక్ డిసీజెస్ అంటారు. కోపం, నిరాశ, దిగులు, క్రుంగుబాటు వలన రక్తపోటు, కడుపులో అల్సర్, గుండెనొప్పి, నిద్రలేమి, కీళ్లనొప్పులు రావడం మనకు తెలుసు. జీవితంలో కష్టాలు లేనివారు ఎవరూ లేరు. అయితే రోజులో కాసేపయినా మనసు ప్రశాంతంగా ఉంచుకోవడం కోసం సంగీతం, సాహిత్యం, యితర లలితకళ ఏదైనా వినడమో, చూడడమో అలవరచుకోండి. యోగా, ధ్యానం చేయండి. యోగాసనాలకు ఒళ్లు 'వంగని'వారు కనీసం ప్రాణాయామం చేయండి.

ఈ కాలుష్యవాతావరణంలో అన్నిటికంటే ఎక్కువగా దెబ్బ తినేవి ఊపిరితిత్తులే. కరోనా కూడా ఊపిరితిత్తులను ముడుచుకునేట్లా చేస్తుంది. ప్రాణాయామంతో అవి విప్పారుతాయి. పూర్తి స్థాయిలో పనిచేస్తాయి. ఇక ధ్యానమంటారా, ఏకాగ్రత కుదరడం లేదని మానేయకండి. ఇవన్నీ అభ్యాసంపైనే వస్తాయి. ఇతరులకు ఉపకారం చేయకపోయినా, అపకారం చేయకుండా వుండాలి అనే బుద్ధి వుంటే మనసును ప్రశాంతంగా వుంచుకోవడం మరీ అంత కష్టం కాదు.

ఇక – అనుకున్నది దక్కలేదు, కష్టానికి తగిన ఫలితం రాలేదు, నన్నెవరూ అర్థం చేసుకోవటం లేదు, దేవుడు నన్ను చల్లగా చూడటం లేదు, పక్కవాడికి అర్హత లేకపోయినా అన్నీ యిచ్చాడు వంటి ఆలోచనలు కూడా మనశ్శాంతిని చెడగొడతాయి. మన కర్మ సిద్ధాంతాన్ని నమ్మండి. పాశ్చాత్యులూ దాన్ని నమ్మడం మొదలుపెట్టారు. వాళ్లూ మాటలలో 'కర్మ' వాడడం మొదలెట్టారు. ఎందుకంటే దైవలీలలు ఎవరికీ అర్థం కావు. బిడ్డకు పాలెప్పుడివ్వాలో, పాయసం ఎప్పుడివ్వాలో తల్లికి తెలిసున్నట్లు, మనకు ఎప్పుడు ఏది యివ్వాలో భగవంతుడికి తెలుసు. నువ్వు తగినవాడివి అనుకుంటే అయాచితంగా యిస్తాడు. అది నువ్వు భరాయించు కోలేవనుకుంటే ఏడ్చి మొత్తుకున్నా యివ్వడు. అందువలన భగవద్గీతలో చెప్పినట్లు – నీ పని నువ్వు చేసుకుంటూ పో, ఫలితంపై ఆశ పెట్టుకోవద్దు. అది దేవుడి పని. ఫలితాన్ని ఆశించి పని చేయవద్దు. 'ఇది నా ధర్మం, నిర్వర్తిస్తున్నాను.' అనుకుంటూ చేసుకుంటూ పోవడమే మన పని. ఈ సిద్ధాంతాన్ని నమ్మిచెడినవాడు లేడు.

ఇదీ మొత్తంగా నేను చెప్పదలచినది. సారాంశంగా మూడుముక్కల్లో చెప్పాలంటే – శరీరాన్ని, మనసును, బుద్ధిని శుచిగా పెట్టుకోండి, మంచి ఆహారం తినండి, మంచి అలవాట్లు పాటించండి, శరీరాన్ని దృఢంగా చేసి పెట్టుకోవడమే దివ్యమైన వాక్సిన్. దాన్ని ఏ ట్రంపూ బెదిరించి లాక్కోలేడు. సమాజం కూడా శుచిగా వుండేట్లు పౌరుడిగా కృషి చేయండి, పాలకులపై ఒత్తిడి తెండి. విద్య, వైద్యానికి గౌరవం యివ్వండి, ప్రభుత్వానికి చెప్పి పెద్ద పీట వేయించండి, ఆరోగ్యమే మహాభాగ్యమని, అధికధనమూ, ఆయుధాలు ఆపత్సమయాన అక్కరకు రావని గుర్తించమనండి. కరోనాను దూషించకుండా బుద్ధి చెప్పడానికి వచ్చిన ఉపాధ్యాయుడిలా గౌరవించి గుణపాఠాలు నేర్చుకోండి. చివరిగా ఎవరూ అప్పటికప్పుడు ఔషధాలూ, టీకాలు సృష్టించలేరని, ముందుజాగ్రత్తే పరమౌషధమని గుర్తు పెట్టుకోండి.

**ఐసియు కన్న ఇల్లు పదిలం**
**వెంటిలేటరు కన్న మాస్క్ నయం**
**చికిత్స కన్న నివారణ శ్రేయం**

# గూడూరు డివిజన్ వార్తలు

## గిరిజనులకు సేవ.. స్ఫూర్తిదాయకం

### - మునిసిపల్ కమిషనర్ ఓబులేశు



గిరిజనులకు కూరగాయలు పంపిణీ చేస్తున్న మునిసిపల్ కమిషనర్ ఓబులేశు, షేక్ జమలుల్లా

లాక్‌డౌన్ నేపథ్యంలో నిరుపేద గిరిజనులకు తమవంతు సాయం అందిస్తూ సేవలందించడం ఎంతైనా స్ఫూర్తిదాయకమని గూడూరు మునిసిపల్ కమిషనర్ ఓబులేశు గూడూరులోని షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారి సేవలను కొనియాడారు. ఈనెల 12న అసోసియేషన్ ఆధ్వర్యంలో పురిటిపాళెం గిరిజన కాలనీ, రోటరీనగర్‌లోని గిరిజన కాలనీల్లో 150 కుటుంబాల వారికి వారం రోజులకు సరిపడా కూరగాయలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మునిసిపల్ కమిషనర్ మాట్లాడుతూ కరోనా మహమ్మారి వ్యాధి ప్రపంచాన్ని వణికిస్తోందని, ఈ నేపథ్యంలో ప్రజలందరూ సామాజిక దూరం పాటించి వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు సహకరించాలని కోరారు. ప్రజలంతా భౌతికదూరం పాటించాలని, ఇళ్ళలోనే ఉండాలని, త్వరలోనే ఇక్కడున్న ప్రతి కుటుంబానికి పది కేజీల బియ్యం పంపిణీ చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వైజీవిఎస్‌బిఏ అధ్యక్షుడు షేక్ జమలుల్లా మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులు, పట్టణంలోని షటిల్ క్రీడాకారుల సహకారంతో గిరిజనులకు కూరగాయలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గాదంశెట్టి గిరిబాబు, షేక్ అబ్దుల్ కలామ్, షేక్ జమీల్, రమేష్, కోదండపాణి, ప్రసాద్, ఫిరోజ్ నయీమ్, హైదర్ ఆలీ, జబీవుల్లా, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం దాతృత్వం



సబ్‌కలెక్టర్‌కు 50వేలు, కమిషనర్‌కు 50వేలు చెక్కులను అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం

కరోనా బాధితుల సహాయార్థం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం వారు ఈనెల 13న లక్ష రూపాయలు అందజేశారు. గూడూరు సబ్‌కలెక్టర్‌కు 50వేల రూపాయలు, మునిసిపల్ కమిషనర్‌కు 50వేలు వంతున ఆ నిధిని అందజేశామని ఆ సంఘం కేంద్రకమిటీ అధ్యక్షులు వరిదిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కరోనా మహమ్మారి వల్ల ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించడంతో కూలిపనులు చేసుకునే ఎంతోమంది నిరుపేదలు పనులు లేక, జీవనోపాధి లేక ఇబ్బందుల పడకూడదని తమవంతు సాయం అందజేశామన్నారు. ఎంతోమంది స్వచ్ఛంధసంస్థల వారు కూడా ఈ తరుణంలో ముందుకు వచ్చి పేదలకు సేవలు చేస్తుండడం ఎంతో అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు బుస్సారెడ్డి దశరథరామిరెడ్డి, కోశాధికారి బత్తల సుబ్బారెడ్డి, కార్యదర్శులు సురేంద్రరెడ్డి, కలికి జనార్దన్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, ఏలూరు రామకృష్ణారెడ్డి, తిరుమూరు సురేష్‌రెడ్డి, మండి శ్రీనివాసులురెడ్డి, సిద్ధారెడ్డి, గూడూరు రూరల్ గౌరవాధ్యక్షులు మల్లు విజయకుమార్‌రెడ్డిలతో పాటు గూడూరు తహశీల్దార్ బాలలీలారాణి, డాక్టర్ సి.రోహిణి, గూడూరు మునిసిపల్ కమిషనర్ ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఆర్థిక సాయం



పేదలకు ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాస చౌదరి

తమ కుమార్తె రిషిత పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 13న వైకాపా నాయకుడు శ్రీనివాస చౌదరి తన సొంతగ్రామమైన సైదాపురం మండలంలోని పొక్కందల గ్రామంలో ఉన్న ఎస్సీ, ఎస్టీల కాలనీవాసులకు తమవంతు ఆర్థికసాయం అందజేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఇక్కడున్న 106 కుటుంబాల వారికి వారి కుటుంబ అవసరాలకు ఒక్కో కుటుంబానికి 2 వందల రూపాయల వంతున మొత్తం 21,200 రూపాయలు సాయమందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు కరోనా మహమ్మారి, మరోవైపు లాక్‌డౌన్‌ల నేపథ్యంలో తమ గ్రామంలో పనులు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు తమవంతు సాయం అందించామని చెప్పారు.

# మేమున్నామంటూ దాతల భరోసా

### - పేదలను ఆదుకుంటున్న వదాన్యులు, స్వచ్ఛంధసేవకులు



కరోనా మహమ్మారి నేపథ్యంలో ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించడంతో పేద ప్రజలు ఇబ్బందులు పడకుండా తమవంతు సాయం అందిస్తూ నిరుపేదల కష్టాలు తీర్చేందుకు తామున్నామంటూ గూడూరులోని ఎందరో దాతలు, స్వచ్ఛంధసంస్థల వారు ముందుకు వస్తున్నారు. తమ శక్తిమేరా పేదలకు తమవంతు సహాయ సహకారాలను అందిస్తూ తమ సేవాభావాన్ని చాటుకుంటున్నారు. గూడూరు పట్టణానికి చెందిన వైకాపా నాయకుడు, వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బత్తిని విజయకుమార్ మాట్లాడుతూ లాక్‌డౌన్ పూర్తయ్యేవరకు తమ సేవాకార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడుతున్నామని చెప్పారు. గూడూరు పట్టణంలోని మూడువందల మంది నిరాశ్రయులకు ఆహారం అందించామన్నారు. గూడూరులో రెడ్‌జోన్‌గా ప్రకటించివున్న పార్కువీధి ప్రాంత ప్రజలకు తాము అండగా ఉంటామని, ఈ విపత్కర పరిస్థితుల్లో సమాజానికి అకుంఠిత సేవలందిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి, జర్నలిస్టులకు తమ ట్రస్ట్ ద్వారా సాయం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బత్తిని విజయకుమార్‌తో పాటు బత్తిని అనురాగ శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు. నిరంతరం ప్రజాసంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంధసంస్థలు, పోలీసులు, వైద్య అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ ఉద్యోగులు, జర్నలిస్టులు తదితరులందరికీ వారు ఈ సందర్భంగా తమ కృతజ్ఞతలు తెలిపారు.

### గూడూరు పల్లెల్లో విస్తృతంగా

## పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్ సేవలు



కరోనా వైరస్ నేపథ్యంలో లాక్‌డౌన్ అమలులోకి వచ్చినరోజు నుండి పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్ అధినేత, వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి నిరాశ్రయులైన ఎంతోమంది అన్నార్థులకు భోజన సదుపాయాలను కల్పించారు. అలాగే లాక్‌డౌన్ అమలులోకి వచ్చిన రోజు నుండి కోట, వాకాడు, చిల్లకూరు, గూడూరు రూరల్ మండలాలలో పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు, నిరాశ్రయులకు ఉచితంగా కూరగాయలను భారీ ఎత్తున పంపిణీ చేస్తున్నారు. పేర్నాటి అందిస్తున్న సేవలను ఈ మండలాల్లోని ప్రజలు వేనోళ్ళ కొనియాడుతున్నారు.

## ప్రైవేట్ పాఠశాలల సంఘం వితరణ



- శ్రీకాంత్‌రెడ్డి

గూడూరు పట్టణంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ వారు లక్ష రూపాయలు, ప్రాస్పరో ఇంగ్లీష్ మీడియం స్కూల్ వారు 50వేల రూపాయలు, మిగతా స్కూల్స్ వారితో కలిపి మొత్తం లక్షా 75వేల రూపాయలను కరోనా బాధితుల సహాయార్థం విరాళం అందించి తమ వితరణను చాటుకున్నారు. ఈ మొత్తాన్ని ప్రైవేట్ పాఠశాలల రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర ముఖ్యమంత్రికి అందజేయడం జరుగుతుందన్నారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో ప్రజలంతా ఇళ్ళలోనేఉండి కరోనా వ్యాప్తిని అరికట్టాలని, మన కుటుంబాలను, దేశాన్ని కాపాడుకోవాలని అసోసియేషన్ గూడూరు డివిజన్ అధ్యక్షుడు, లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్‌స్కూల్ కరెస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కళాకారుల కుటుంబాలకు ప్రగతి సేవాసంస్థ సాయం



గూడూరులోని ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలైన పదిమంది కళాకారుల కుటుంబాలకు ఇటీవల పలసరుకులు, కూరగాయలు అందజేశారు. దమాయి శ్రీనివాసులు సహకారంతో ఈ సాయం అందించారు. గూడూరు మునిసిపల్ కమిషనర్ ఓబులేశు చేతులమీదుగా ఈ వితరణ జరిగింది. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ యమహా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

### జేవీవీ ఆధ్వర్యంలో

## గిరిజనులకు నిత్యావసర సరుకులు



గూడూరు జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో, విద్యుత్ శాఖ ఏ.ఇ సుబ్రహ్మణ్యం దాతృత్వంతో ఇటీవల నేలటూరుకు వెళ్ళే దారిలో చెరువుకట్ట కింద ఉన్న నిరుపేద గిరిజన కుటుంబాలవారికి మల్లు విజయకుమార్‌రెడ్డి ద్వారా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ లాక్‌డౌన్ సందర్భంగా ఇబ్బందులు పడుతున్న గిరిజన కుటుంబాలకు జేవీవీ వారు నిత్యావసర సరుకులు అందజేసి తమ సేవా భావాన్ని చాటుకోవడం అభినందనీయమన్నారు. ప్రజలు ఇళ్ళలోనే ఉండి లాక్‌డౌన్ నిబంధనలు పాటించాలని, కరోనా మహమ్మారిని తరిమికొట్టేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, మనోహర్ గౌడ్, ఓరేపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు చేగువేరా ఫౌండేషన్ చేయూత



వలస కూలీలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న మండ్ల సురేష్‌బాబు

గూడూరు చవటపాళెం సమీపంలోని వర్మికంపోస్ట్ కర్మాగారంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆశ్రమ కేంద్రంలో ఉన్న ఉత్తరప్రదేశ్ వలస కూలీలకు గత 13రోజులుగా చేగువేరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఆ సంస్థ వ్యవస్థాపకుడు మండ్ల సురేష్‌బాబు ఆహారం అందజేశారు. ఈ కార్యక్రమం నిరంతరం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈనెల 13న వారికి నిత్యావసర సరుకులను కూడా ఆయన అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ల సూచనలతో తాము ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధికోసం ఇక్కడికి వచ్చినవారికి అండగా ఉంటున్నామని, వారికి తమవంతు సేవలందిస్తున్నామని చెప్పారు. మల్లికార్జునరావు, ప్రశాంతి, సంస్థ వైస్‌ప్రెసిడెంట్ క్రాంతి కుమార్, వినోద్, పవన్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

# పరిశ్రమలకు అన్ని విధాలా అండగా ఉంటాం

## - శ్రీసిటీలో పారిశ్రామికవేత్తలకు చిత్తూరు, నెల్లూరు, తిరువళ్లూరు ఎస్పీల హామీ



కరోనా మహమ్మారిని నిలువరించడానికి అధిక ప్రాధాన్యమిస్తూనే, ప్రభుత్వ నిబంధనల మేరకు పరిశ్రమలు నడిపేందుకు తాము అన్నివిధాలా సహకరిస్తామంటూ శ్రీసిటీ పరిసర జిల్లాల ఎస్పీలు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల సూచనలమేరకు ప్రభుత్వాధికారులు, పరిశ్రమల ప్రతినిధుల సమావేశం ఈ నెల 13న ఉదయం శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో నిర్వహించారు. ఇందులో శ్రీసిటీ సెజ్ డెవలప్మెంట్ కమీషనర్ ముత్తురాజ్, చిత్తూరు ఎస్పీ ఎస్. సెంథిల్ కుమార్, నెల్లూరు ఎస్పీ భాస్కర్‌భూషణ్, తిరువళ్లూరు (తమిళనాడు) ఎస్పీ అరవిందన్, తిరుపతి ఆర్‌డీఓ కనకనరసారెడ్డి, నాయుడుపేట ఆర్‌డీఓ సరోజినీ, శ్రీసిటీ డీఎస్పీ విమలా కుమారి తదితరులు పాల్గొన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వీరికి సాదరస్వాగతం పలికారు.

సమావేశంలో ప్రధానంగా, కరోనా దేశవ్యాప్త లాక్‌డౌన్ సమయంలో శ్రీసిటీలోని ఆహార, ఔషధ, ప్యాకేజింగ్ రంగానికి చెందిన సుమారు 30 పరిశ్రమలకు అనుమతులుప్పటికీ, రాష్ట్ర సరిహద్దులు, జిల్లాల సరిహద్దుల వద్ద తాము పలు సమస్యలు ఎదుర్కొంటున్నామంటూ పరిశ్రమల ప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చారు. మరోవైపు కొన్నిశ్రీసిటీ పరిసర గ్రామాల్లో కంపెనీలకు ఉద్యోగులు రాకుండా అడ్డుకుంటున్నారని, మరికొన్ని గ్రామాల్లో రోడ్లుకు అడ్డంగా కంచెలు వేసి రాకపోకలను అడ్డుకోవడం జరుగుతోందని వాపోయారు. దీనిపై ఎస్పీలు స్పందిస్తూ, పరిశ్రమ వర్గాల ఇబ్బందులు తొలగిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు పరిశ్రమల సరకు రవాణా వాహనాలపై ఎలాంటి ఆంక్షలు లేవని, అయితే ఉద్యోగుల రవాణా వాహనాలపై కొన్ని ఆంక్షలు తప్పవన్నారు. ఆయా జిల్లా కలెక్టర్ల అనుమతుల మేరకు ఉద్యోగులను, వాహనాలను అనుమతించడం జరుగుతుందన్నారు. పేర్లు, వివరాలు ఇస్తే సంబంధిత వాహనాలు, ఉద్యోగులకు పాసులు జారీ చేస్తామన్నారు. అయితే వాహనాల్లో విధిగా భౌతిక దూరం పాటించడంతో పాటు శానిటైజర్లు, మాస్కులు అందుబాటులో ఉంచాలన్నారు. వారానికోసారి ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ రిపోర్ట్ కార్డులు జారీచేయాలని, ప్రతి కంపెనీలోను తాత్కాలిక ఐసోలేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శ్రీసిటీ చిత్రమైన సరిహద్దు కలిగివుందని, పరిశ్రమలన్నీ చిత్తూరు జిల్లాలో ఉన్నప్పటికీ, ప్రధాన ప్రవేశ ద్వారం నెల్లూరుజిల్లాలో ఉంద న్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన చోట్ల సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరించుకోవాలని పరిశ్రమ ప్రతినిధులకు సూచించారు. సమస్యల పరిష్కారాల కోసం కొత్తగా జిల్లా పోలీసు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కరోనా కంట్రోల్ కాల్ సెంటర్లకు ఫోన్ చేయాలని చిత్తూరు, నెల్లూరు జిల్లా ఎస్పీలు తెలిపారు.

సెజ్ డీసీ ముత్తురాజ్ మాట్లాడుతూ, పరిశ్రమల యాజమాన్యాల అభ్యర్థన మేరకు కేంద్ర ప్రభుత్వ చొరవను ప్రస్తావిస్తూ, ఉత్పత్తులు ప్రారంభించాలన్న పరిశ్రమలు ఆయా జిల్లా కలెక్టర్ల నుండి అనుమతి తీసుకోవాలని, అన్ని షరతులు ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. శ్రీసిటీ పరిశ్రమలకు తగు సహకారం అందించేందుకు చొరవ చూపుతూ శ్రీసిటీ సమావేశానికి హాజరైన ఎస్పీలకు, ఇతర అధికారులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## చైతన్య దీపాలు

ఈ సుప్రభాతం
గుండెల్లో గునపాలు గుచ్చుతూ
మరణశాసనం లిఖిస్తోంది
మనిషి మనిషికీ పొసగని
విషపు కౌగిళ్ళలో
వినూత్న సమైక్యతా నాదం
కాంతులీనుతోంది
దేశ దేశాల రోదనల్లో కన్నీటి సంద్రాలు
పెల్లుబుకుతున్నాయి
బ్రతుకుల్ని మృత్యుద్వారానికి
వ్రేలాడదీసిన ఓ చిన్న క్రిమి
ప్రపంచమంతా అల్లకల్లోలం సృష్టిస్తోంది
ఎవరో వెలిగించిన నిప్పురవ్వ
మృత్యుజ్వాలగా మారి
కోట్లాది స్వప్నాలను చిదిమేస్తుంది
వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తుంది
భయోత్పాతాన్ని కలిగిస్తోంది
మరే ఇతర గ్రహాలపై వసించలేని
ఈ ఉన్మాద వైరస్
అవనిపై రక్తారుణరేఖలు గీస్తోంది
శ్వాసకోశ శోకంతో జనం
విలవిలలాడిపోతున్నారు
కొత్త రోబోటిక్ యాంత్రికతతో
జనజీవనం స్తంభించిపోతోంది
సహస్ర వెలుగుకిరణాల చేతులతో
సరికొత్త భానుడు ఉదయిస్తాడని
పుడమితల్లి ఆత్రంగా ఎదురుచూస్తోంది
మనం కొలిచే దేవుళ్ళంతా
రాత్రి సూర్యుళ్ళయి పోయారు
మన పూజలేవీ ఈ విలయానికి
ముగింపు పలుకలేక పోయాయి
కనిపించని ఈ గాయాలకు
లేపనం పూసి
కనురెప్పలపై జారే చీకటిని తుడిచి
రేయింబవళ్ళూ ప్రాణదానం చేస్తున్న
వైద్యనారాయణులకు తలవొంచి
నమస్కరిద్దాం
అనుక్షణం జనజీవనానికి పహారాకాసే
లక్షలాది రక్షకభటుల సేవలకు
సాగిలపడదాం
దుర్గంధాన్ని తమ చేతుల చీపుర్లతో
తొలగిస్తున్న ఆ చైతన్య దీపాలకు
మొక్కుదాం
నడయాడే దేవుళ్ళకు ప్రణమిల్లుదాం
వెల్లివిరిస్తున్న మానవీయతను
మనసారా స్వాగతిద్దాం

- చిన్ని నారాయణరావు
9440202942

## జొన్నవాడలో ఆకలి కేకలు

నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడ పుణ్యక్షేత్రంలో కొంతమంది దిక్కులేని వారు, నిరాశ్రయులు, యాచకులు, వృద్ధులు సుమారు 30మంది గత కొన్ని రోజులుగా ఆకలి బాధలతో అలమటిస్తూ చెట్లకింద, షెల్టర్లలో తలదాచుకుంటున్నారు. దాతలు అందజేసిన ఆహార పొట్లాలను ఒకపూట తిని రెండు పూటలు పస్తులుంటున్నారు. ఆలయం తరపున నిత్యాన్నదానం నుంచి ఇతర ప్రాంతాల్లోని ప్రజలకు ఆహార పొట్లాలను అందజేసిన ఆలయ పాలకులు, అధికారులు ఆలయ పరిసరాలలో ఉండే వీరి గురించి పట్టించుకోక పోవడంపై విమర్శలు వినవస్తున్నాయి.

శ్రీను గల్పిక

# దేవలోకాల్లోనూ లాక్‌డౌన్

అది వైకుంఠం... శేషపాన్పుపై పవళించిన శ్రీ మహావిష్ణువు పాదాలను మహాలక్ష్మి ఒత్తుతూ వుంది. మహావిష్ణువు ఆమె చేతి స్పర్శతో మైమరచిపోయి పరధ్యానంలో వున్నాడు. అంతలో అక్కడ 'నారాయణ నారాయణ' అనే మాటలు వినిపించాయి. లక్ష్మీదేవి అటుకేసి చూడగా చేతిలో తంబూరతో నారదుడు... ఆయన ముఖం వైపు చూసి లక్ష్మీదేవి షాక్‌తింది. కారణం ఆయన నోటికి ఏదో గుడ్డ కట్టి వుంది. అది చూసి లక్ష్మీదేవి అదేంటి నారద... లేగదూడల మూతులకు బిగించే వాటిని నీ నోటికి కట్టుకున్నావ్ అని అడిగింది. అందుకు నారదుడు... తల్లీ ఇది అది కాదు... దీనిని మాస్క్ అంటారు, ఇప్పుడు భూలోకమంతా ఇదే వాడుతున్నారు. నేను తరచూ భూలోకంలో సంచరిస్తుంటాను కాబట్టి నాకు ఎంతో అవసరం. ఇప్పుడు భూగోళంలో కరోనా వైరస్ చెలరేగింది. ఆ వైరస్ దెబ్బకు భూలోకంలో మానవులంతా ఇది కట్టుకుని తిరుగుతున్నారు. ఈ వైరస్ భూలోకానికే కాక దేవలోకాలకు కూడా విస్తరించే ప్రమాదముందంట... కాబట్టి ఈ వైరస్ కట్టడి కోసం తీసుకోవాల్సిన చర్యలపై రేపు కైలాసంలో మీటింగ్ పెట్టారు, ఆ మీటింగ్‌కు పెద్దాయనను ఆహ్వానిద్దామని వచ్చాను, అయినా మీరేంటి, ఇంకా ఆయన కాళ్ల దగ్గర పడివుంటున్నారు. మీ స్త్రీ జాతి ఎప్పటికీ ఇంతేనా, ఎప్పటికీ మారరా, అవతల భూలోకలంలో చూడండి.. ఎన్ని మార్పులొచ్చాయో, మహిళలు రాజ్యాలు ఏలుతున్నారు, విమానాలు నడుపుతున్నారు, రాకెట్లలో అంతరిక్షంలోకి పోతున్నారు, ముఖ్యంగా ఈ కరోనా వైరస్ ప్రబలిన కాలంలో అయితే భూలోకంలో మహిళలదే రాజ్యమైంది. లాక్‌డౌన్ మూలంగా మగవాళ్లంతా ఇళ్లలోనే వుండిపోవాల్సి వచ్చింది, దాంతో ఇంట్లో ఆడోళ్లు బట్టలుతకడం, అంట్లు తోమడం, వంట చేయడం, పిండి రుబ్బడం వంటి పనులన్నీ మగాళ్ళ చేతే చేయిస్తున్నారు. ఎవరైనా చేయమని మొండికేస్తే గృహహింస క్రింద కేసులు పెడుతున్నారు, అసలు ఇలా కాళ్లు ఒత్తించుకునే మొగుళ్లనైతే... "మొగుడిని కసితీరా కొట్టిన పెళ్లాం" సీరియల్‌లో భార్య వసుంధర తన భర్త శశిధర్‌ను చితక్కొట్టినట్లు కొడుతున్నారని చెప్పాడు. లక్ష్మీదేవి చేత కాళ్ళు ఒత్తించుకుంటూ పరధ్యానంలో వున్న విష్ణుమూర్తి చెవులకు ఆ చివరి మాటలు తాకాయి. అంతే విష్ణుమూర్తి ఉలిక్కిపడి కాళ్లు వెనక్కు లాగేసుకుని... దేవీ ఇంకెప్పుడూ నా పాదాలు మర్దన చేయవద్దు, ఈ కేసుల గొడవ నాకెందుకు అని అనసాగాడు. అప్పుడు లక్ష్మీదేవి... అయ్యో ప్రాణనాథ, మీ పాదాలు రోజుకొకసారైనా మర్దన చేయకుంటే నా ప్రాణం స్థిమితంగా వుండదు, మన నారద మహర్షి మాటలకేంలే... ఈమధ్య భూలోకంలో ఎక్కువగా తిరుగుతూ అక్కడ టీవీ ఛానెల్స్ డిబేట్లను మరీ ఎక్కువగా చూస్తున్నట్లున్నాడు. భార్యాభర్తల మధ్య కూడా అగ్గిపుల్ల గీసి పుల్లలు పెడుతున్నాడు, అతని మాటలకేంలే... నేను అవేమీ పట్టించుకోనని చెప్పింది. ఏం నారద, ఇలా వచ్చావు అని విష్ణుమూర్తి అడిగాడు. అందుకు నారదుడు... స్వామీ, కరోనా వైరస్ ప్రభావం దేవలోకాలపై పడకుండా చేసేందుకు రేపు కైలాసంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు, మిమ్మల్ని తప్పకుండా రమ్మన్నారు అని చెప్పి... 'నారాయణ... నారాయణ' అనుకుంటూ నారద మహర్షి వెళ్లిపోయాడు.

★★★★★

అది కైలాసం.. సోషల్ డిస్టెన్స్‌ను పాటిస్తూ విష్ణు, శివ, బ్రహ్మలు దూరదూరంగా కూర్చుని వున్నారు. అందరూ నోర్లు, ముక్కుకు అడ్డంగా ఎన్-95 మాస్కులు తగిలించుకుని వున్నారు. వారికెదురుగా పెద్ద స్క్రీన్ వుంది... మొదట భూలోకంలో కరోనా వైరస్ మూలంగా దెబ్బతిన్న వివిధ దేవుళ్ళతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించసాగారు. తిరుమల వేంకటేశ్వరుడు, కాణిపాకం వినాయకుడు, శ్రీశైలం మల్లిఖార్జునుడు, బెజవాడ కనకదుర్గమ్మ, సింహాద్రి అప్పన్న, అన్నవరం సత్యదేవుడు, షిరిడి సాయిబాబా, పెంచలకోన నరసింహుడు, జొన్నవాడ కామాక్షమ్మ, సూళ్లూరుపేట చెంగాళమ్మ... ఇలా అందరినీ వీడియో కాన్ఫరెన్స్‌లోకి తీసుకుని వారి సమస్యలు అడిగారు. అందరూ ఒకే మాట చెప్పారు... లాక్‌డౌన్ మూలంగా భక్తుల దర్శనాలు లేవని, వారిని చూడక చాలారోజులైందని, అలాగే తమ ఆదాయం కూడా గణనీయంగా పడిపోయిందని, తమను అధిష్టానం ఆదుకోవాలని. వీళ్ళ బాధలు విన్నాక... విష్ణు, బ్రహ్మ, మహేశ్వరులు... కరోనావైరస్ ప్రభావం తీవ్రంగా వున్నట్లుంది, దాని దెబ్బకు దేవుళ్లే దివాళా తీశారు, ఇక సామాన్య ప్రజలు ఎలా భరించగలరు... మనం కూడా ఈ వైరస్‌తో జాగ్రత్తగా వుండాలి అని చెప్పి యమధర్మరాజు, దేవేంద్రుడుతో పాటు మరికొందరు గంధర్వ లోకాల అధిపతులను లైన్‌లోకి తీసుకుని వీడియో కాన్ఫరెన్స్ మొదలుపెట్టారు. అన్ని దేవలోకాలలో ఇప్పుడే రెడ్అలర్ట్ ప్రకటిస్తున్నాం, వైకుంఠం, కైలాసం, యమలోకం, ఇంద్రలోకంతో సహా అన్ని దేవలోకాలలో ఈరోజు నుండి లాక్‌డౌన్ అమలు చేస్తున్నాం, దేవలోక నివాసులు విధిగా మాస్కులు వాడాలి, శానిటైజర్లు పూసుకుంటుండాలి, ముఖ్యంగా ఇంద్రలోక అధిపతి ఇంద్రుడు ఈ నియమాన్ని ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

అప్పుడు ఇంద్రుడు... ముల్లోకాధిపతులు నన్ను క్షమించాలి... లాక్‌డౌన్‌ను మీ లోకాలలో అమలు చేసుకోండి... మాకు అవసరం లేదు అని చెప్పాడు. అప్పుడు విష్ణుమూర్తి... అదేంటి ఇంద్రా, నువ్వు కూడా భారతదేశంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ లాగా తయారయ్యావ్, వైరస్‌కు మీరు అతీతులా అని అడిగాడు. దానికి దేవేంద్రుడు... అదేం లేదు ప్రభూ... కరోనాకు అమ్మ మొగుడు లాంటి వ్యక్తి మా లోకంలో వున్నాడు. ఆయనను చూస్తే ఎలాంటి వైరస్ అయినా చావు భయంతో పరుగులు తీస్తుంది... అతను కరోనా వైరస్‌తో బంతాట ఆడుకోగలడు, కాబట్టి ఆయన వున్న చోట ఏ వైరస్ రాదు అని ధీమాగా చెప్పాడు. ఆ అద్భుత వ్యక్తి ఎవరు? అని బ్రహ్మ అడిగాడు. దానికి దేవేంద్రుడు... మీ అద్భుత సృష్టిలో ఒక అమూల్య ఖండకావ్యం ఈయన అంటూ ఒక వ్యక్తిని చూపిస్తూ... ఈయన పేరు స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి(69)... ఈయన భూలోకంలో వున్నంత కాలం కరోనా వైరస్ అక్కడకు రావడానికి భయపడింది. ఆయన ఇక్కడకు రాగానే అక్కడ చెలరేగింది. ఆయన ఇక్కడున్నంత కాలం మమ్మల్ని ఏ వైరస్ ఏమీ చేయలేదు అని ధీమాగా చెప్పాడు. వీడియోలో వివేకాను చూసిన పరమేశ్వరుడు... ఈ వ్యక్తిని ఇంతకుముందు ఎక్కడో చూసినట్లుందే... అని అడిగాడు. అప్పుడు విష్ణుమూర్తి... ఎక్కడో చూడడమేమిటి, ఈమధ్య ఏ టీవీ ఛానల్‌లో చూసినా, ఏ సోషల్ మీడియా టిక్‌టాక్‌లో చూసినా 'ఓరినీయమ్మ బడవా ఏందయ్యా ఇదీ నేనెప్పుడూ చూడలా'... అనే ఈయన డైలాగ్‌లే హల్‌చల్ చేస్తున్నాయి కదా... అని గుర్తు చేశాడు. తర్వాత త్రిమూర్తులు లాక్‌డౌన్ నుండి ఒక్క స్వర్గలోకాన్ని తప్పించి మిగతా అన్ని దేవలోకాలలో అమలు చేయాలని నిర్ణయించి ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

# కరోనా కాటుకు వైద్యుడు మృతి



కరోనా కాటుకు నెల్లూరుజిల్లాలో ప్రముఖ వైద్యుడే మొదటిగా బలయ్యాడు. నెల్లూరు, మాగుంట లే అవుట్‌లో వుంటున్న ప్రముఖ కీళ్ళు, ఎముకల వ్యాధి నిపుణులు డాక్టర్ పి.లక్ష్మీనరసారెడ్డి కరోనాతో ఈ నెల 13వ తేదీన చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కనుమూశాడు. ఆయన వయసు 55 సంవత్సరాలు. ఆయనకు భార్య, ఒక కుమారుడు వున్నారు. కడపజిల్లాకు చెందిన పి.లక్ష్మీనారాయణరెడ్డి కుటుంబం ఎప్పటి నుండో నెల్లూరులో స్థిరపడింది. లక్ష్మీ నారాయణ రెడ్డి పొగతోటలో స్వంతంగా క్లినిక్‌ను నిర్వహిస్తూ పలు ఆసుపత్రులలో కన్సల్టెంట్‌గా కూడా పని చేసేవాడు. ఇటీవల పొగతోటలోనే కొత్త హాస్పిటల్ భవనం నిర్మించి, లాక్‌డౌన్ టైంలోనే ప్రారంభించాడు! అయితే ఆ సమయంలోనే ఆయన తీవ్రమైన జ్వరం, దగ్గుతో బాధపడుతూ నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించుకున్నాడు. అయితే ఆయనకు జ్వరం ఎంతకూ తగ్గకపోవడంతో వైద్యులు అనుమానంతో కరోనా టెస్ట్‌లు నిర్వహించారు. కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో తొలుత ఆయనకు నెల్లూరులోని కోవిడ్-19 ఆసుపత్రి ఐసోలేషన్‌లో ఉంచి చికిత్సనందించారు. అయితే అప్పటికే ఆయనకు న్యూమోనియా తీవ్రంగా ఉండడంతో ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయి. మెరుగైన వైద్యం కోసం ఆయనను చెన్నైలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందినా ఫలితం లేకుండా పోయింది. ఈనెల 13న ఆయన తుదిశ్వాస విడిచాడు. ఆయన అంతిమ సంస్కారాలను బంధువులెవరూ లేకుండానే చెన్నైలోని పోరూరు శ్మశాన వాటికలో నిర్వహించారు.

ఆయనకు కరోనా పాజిటివ్ వుండడం వల్ల ఆయన భార్యకు, ఆయన డ్రైవర్‌కు, ఆయన హాస్పిటల్ ఫార్మాసిస్ట్‌కు కూడా ఈ వైరస్ సోకింది. దీంతో వాళ్లను ఐసోలేషన్‌లో వుంచి చికిత్సనందిస్తుండడంతో భార్యా బిడ్డలు ఆయనను కడసారి చూడలేకపోవడం అత్యంత విషాదకరం. లక్ష్మీనారాయణరెడ్డి మృతికి నివాళులర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## ఆలోచింపజేస్తున్న సునితా ఆర్ట్ పెయింటింగ్




కరోనా మహమ్మారి రోజురోజుకు విజృంభిస్తున్న నేపథ్యంలో లాక్‌డౌన్‌ను మే3వతేదీ వరకు పొడిగించాల్సి వచ్చింది. ఈ క్రమంలో నెల్లూరు బాలాజీనగర్‌కు చెందిన చిత్రకారిణి కనుపర్తి సునీతారవి కరోనాతో ప్రపంచ యుద్ధం అన్నట్లుగా పలు అంశాలను తన కుంచెతో క్రోడీకరిస్తూ చిత్రించిన 'గాడ్స్ పవర్ ఈజ్ ద కీ' అనే ఆర్ట్ పెయింటింగ్ అందరినీ ఆలోచింపజేస్తున్నది.

## కాలధర్మం

## దేవిరెడ్డి కృష్ణారెడ్డి(డి.కె.రెడ్డి)



నెల్లూరుజిల్లా అల్లూరు మండలంలోని పురిణి వాసి, ప్రస్తుతం బెంగుళూరు నివాసి, మంచి స్నేహసంబంధాలు కలిగిన స్నేహాభిలాషి దేవిరెడ్డి కృష్ణారెడ్డి(71) ఏప్రియల్ 12వ తేదీ ఆదివారం బెంగుళూరులో కన్నుమూశారు. 1949 జూలై 1వ తేదీన పురిణిలో జన్మించిన ఆయన, బాల్య విద్యాభ్యాసమంతా అల్లూరులోని రామకృష్ణ హైస్కూల్‌లో జరిగింది. అనంతరం కావలిలోని జవహర్ భారతిలో ఉన్నత విద్యను పూర్తి చేశాడు. 1996లో బెంగుళూరుకు వెళ్లి నిర్మాణ రంగంలో అడుగుపెట్టి, అనతి కాలంలోనే మంచి నిర్మాణ సారధిగా గుర్తింపును పొంది, 2000 సంవత్సరంలో "నవ్య" బిల్డర్స్ & డెవలపర్స్ సంస్థను స్థాపించి, అంచెలంచెలుగా ఎదిగి ప్రముఖ నిర్మాణ సంస్థగా తమ నవ్య బిల్డర్స్‌కి గుర్తింపును తీసుకు వచ్చాడు కృష్ణారెడ్డి.

ఒక్క ప్రాజెక్టు మినహా ఎక్కువ శాతం గృహ సముదాయాలను నిర్మించి వందల మంది ఇంటి యజమానుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని చూరగొని, డి.కె అంటే నవ్యతకు, నాణ్యతకు మారుపేరుగా తమ సంస్థ కీర్తిని ఆయన పెంపొందింప జేశాడు. మాటలు తక్కువ, చేతలు ఎక్కువ అన్న సిద్ధాంతాన్ని ఆయన నమ్మేవాడు. తాను చెప్పినదానికన్నా ఎక్కువే అందించి, తమ ఖాతాదారులను సంతృప్తి పరచేవాడు.

ఆయన డి.కె.రెడ్డిగా అందరికీ సుపరిచితుడు. ముఖ్యంగా మంచి స్నేహ సంబంధాలు కలిగిన వ్యక్తి. బెంగుళూరు ఇందిరానగర్ క్లబ్‌లో కృష్ణారెడ్డి ఇక కనపడడు అంటే ఆ ప్రాంగణమే బోసిపోతుందా అన్నంత అనుబంధం ఆయనకి ఆ క్లబ్‌తో ఉంది.

ఆయనకు భార్య అరుణ, కుమార్తెలు దివ్య, నవ్యలు ఉన్నారు. అందరినీ పలకరించుకుంటూ, నేరుగా కాకపోయినా ఫోన్ ద్వారానైనా తనకు కావలసిన వారి క్షేమసమాచారాలు తెలుసుకుంటూ అందరివాడిగా గుర్తింపు పొందిన కృష్ణారెడ్డి మరణంతో దుఃఖ సాగరంలో వున్న వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# చంద్రబాబు కరోనా కుట్రలు

కరోనా వల్ల సంక్షోభం నెలకొన్న సమయంలో చంద్రబాబు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. ఈనెల 15న నెల్లూరుజిల్లా కోటలో ఆయన గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావుతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ ఒక వైపు అధికారులను అప్రమత్తంగా పనిచేయిస్తూ, మరో వైపు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్ణయాలు తీసుకుంటూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంత కష్టపడుతున్నారో ప్రజలు చూస్తున్నారని, ఇలాంటి సమయంలో ప్రతిపక్షనేతగా మంచి సలహాలు ఇవ్వాల్సింది పోయి హైదరాబాద్‌లో కూర్చుని ప్రెస్‌మీట్‌లు పెట్టి రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు కరోనా కంటే ప్రమాదకరమైన వ్యక్తని, జాగ్రత్తగా వుండాలన్నారు. ప్రధాని మోడీ తనను సలహాలు అడిగినట్లు చెప్పుకుంటూ సిగ్గులేక మళ్లీ మోడీ జపం చేస్తున్నాడని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా పేదలను ఆదుకుంటూ, కరోనాను అరికట్టేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ కరోనాను ఎదుర్కొనేందుకు వైయస్సార్‌సీపీ నాయకులు తమ వంతు సాయం అందిస్తున్నారన్నారు. అలాగే ఇటీవల నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రసన్న 2లక్షల రూపాయల విలువచేసే వెయ్యి ఎన్95 మాస్కులను వైద్య సిబ్బంది కోసం అందజేశారు.



జడ్పీ సిఇఓ సుశీలకు ఎన్95 మాస్కులను అందజేస్తున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న

## పిపిఈల వితరణ



కరోనా వైరస్ బాధితుల సేవలో ఉన్న వైద్య సిబ్బంది సంరక్షణ కోసం నెల్లూరులోని హోటల్ అతిథి గ్రాండ్ అధినేత యిమ్మడిశెట్టి సురేష్‌కుమార్ 100 పిపిఈ కిట్‌లను అందజేశారు. ఈ నెల 13వ తేదీ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్ క్యాంపు కార్యాలయంలో మంత్రి పి.అనిల్‌కుమార్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలకు ఆయన ఈ కిట్స్‌ను అందజేశారు.

### బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో..

## నిత్యావసరాల పంపిణీ



కరోనా వైరస్ ప్రభావంతో ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్ నేపథ్యంలో దేవాలయాల్లో పూజలు నిర్వహించే పూజారులకు గూడూరులోని బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గౌరవ అధ్యక్షులు శ్రీకంటి రామమోహన్‌రావు ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆలయాల్లో పూజలు లేక ఇబ్బందులు పడుతున్న పూజారుల కుటుంబాలను గుర్తించి వారికి బియ్యం, ఇతర నిత్యావసరాలను పంపిణీ చేయడం జరిగిందని శ్రీకంటి రామమోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్ నిబంధనలను పాటించి ఇళ్లకే పరిమితం కావాలని, వృద్ధాప్యంలో ఉన్నవారు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడూరు మీరారెడ్డి, బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి అనిమెళ్ల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పిపిఈలు అందించిన చందు




ఎమ్మెస్సార్ సేవా సమితి వ్యవస్థాపకుడు మాగుంట శరత్ చంద్రారెడ్డి(చందు) తన జన్మ దినాన్ని పురస్కరించుకుని రూ.4 లక్షలు విలువచేసే 300 పీపీఈ కిట్లను రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్‌కు ఈనెల 15న నెల్లూరులోని ఆయన కార్యాలయంలో అందజేశారు. అలాగే ఈ నెల 16వ తేదీన 50పీపీఈలను గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణకు కూడా ఎంఎస్ఆర్ సేవా సమితి తరఫున అందజేశారు.

## సిఎం సహాయనిధికి విరాళాలు

కరోనా వ్యాధి నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సాయంగా తమవంతు వితరణగా జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు ఈనెల 11న తమ విరాళాలు అందజేసి అందరి అభినందనలందుకున్నారు. నాయుడుపేట మండలంలోని మేనకూరు సెజ్‌లో ఉన్న గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ ఎం.డి మ్యాథ్యూచెన్ కోవిడ్ బాధితుల సహాయార్థం 20 లక్షల రూపాయలను చెక్కు రూపంలో ఈనెల 11న జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబుకు అందజేశారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో 5 లక్షల రూపాయలు విరాళంగా అందజేయగా, ఆత్మకూరుకు చెందిన వైఎస్సార్సీపి నాయకుడు దేవరపల్లి శ్రీనివాసులురెడ్డి సిఎం సహాయనిధికి లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈనెల 11న ఆయన నెల్లూరులో మంత్రి మేకపాటి గౌతంరెడ్డి నివాసానికి వెళ్లి లక్ష రూపాయల చెక్కును మంత్రికి అందించారు.

## కాంట్రాక్ట్ అధ్యాపకుల విరాళం

కరోనా బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి తమ ఒకరోజు వేతనాన్ని విరాళంగా అందించాలని కోరుతూ నెల్లూరులోని విఎస్‌యు కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం వారు రాసిన లేఖను ఈనెల 14న విఎస్‌యు రిజిస్ట్రార్ ఎల్ విజయకృష్ణారెడ్డికి అందజేశారు. ఈ సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి రమేష్, శంకర్, కావలి పీజీ సెంటర్ ప్రతినిధులు కామేష్, విఎస్‌యు ప్రతినిధులు రామకృష్ణ, సుధాకర్‌రెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు స్వీయ నిర్బంధం పాటించాలి

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



కరోనా మహమ్మారి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలందరూ తప్పనిసరిగా స్వీయ నిర్బంధం పాటించాలని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోరారు. ఈనెల 10న ఆయన నాయుడుపేటలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లాక్‌డౌన్ సందర్భంగా నియోజకవర్గంలోని ఆరు మండలాల పేదలకు సుమారు కోటి రూపాయల విలువజేసే నిత్యావసరాలు, బియ్యం తదితర వస్తు సామగ్రి పంపిణీకి చర్యలు చేపట్టామని చెప్పారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నియోజకవర్గంలోని పేదప్రజలు ఇబ్బంది పడకుండా తగు సాయం అందజేస్తున్నామన్నారు. దాతలు, పరిశ్రమల ప్రతినిధుల చొరవతో పేదప్రజలకు సహాయ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. వైఎస్సార్సీపి మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

- వెంకటగిరి రాజాల వితరణ

## ప్రజలకు 15వేల శానిటైజర్ల పంపిణీ

కరోనా మహమ్మారి నేపథ్యంలో వెంకటగిరిలోని వెంకటగిరి రాజా సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 15న పట్టణ ప్రజలకు 15వేల శానిటైజర్ బాటిళ్ళను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజాకుటుంబీకులైన సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో కరోనా వ్యాధిని అరికట్టేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని కొనియాడారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలు ఇళ్ళ నుంచి బయటకు రాకుండా కరోనా వ్యాప్తి నివారణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.ఢిల్లీబాబు, ఆవుల వెంకటేశ్వరరావు, కె.రమేష్‌బాబు, రాధ, కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

## విఎస్‌యు పరిధిలో పరీక్షలు వాయిదా

నెల్లూరు విఎస్‌యు పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల్లో జరగాల్సిన అన్ని పరీక్షలను కరోనా నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు విఎస్‌యు రిజిస్ట్రార్ డా.ఎల్ విజయకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు, కావలి పీజీ సెంటర్లు, అన్ని కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి మే 3వ తేది వరకు సెలవులు పొడిగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

- అకాల వర్షం.. అపార నష్టం

# బ్రతుకులపై పిడుగులు పడ్డాయ్

- పిడుగుల దెబ్బకు ఏడుగురు మృత్యువాత
- వేలాది ఎకరాల్లో పంటనష్టంతో అల్లాడిన అన్నదాత

*అసలే కరోనా మహమ్మారితో జిల్లా బెంబేలెత్తిపోతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడినట్లుగా జిల్లాపై ప్రకృతి ఒక్కసారిగా విరుచుకుపడి జన జీవితాన్ని మరింత అస్తవ్యస్తం చేసింది. ముఖ్యంగా రైతులు ఈ అకాలవర్షాలకు నష్టాలపాలయ్యారు. ఈనెల 9న కురిసిన వర్షంతో రైతన్నలు మరింతగా కుదేలైపోయారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో పాటు పిడుగులు పడడంతో జనం భీతావహులయ్యారు. జిల్లాలో ఈ పిడుగుల దెబ్బకు ఏడుగురు మృత్యువాత పడడంతో ఆయా కుటుంబాల రోదన అంతా ఇంతా కాదు. జన జీవితాన్ని అల్లకల్లోలం చేసిన ఈ కుండపోత వాన, ఈదురుగాలులతో పంటలు, తోటలు నాశనమయ్యాయి. అసలే నష్టాలతో అష్టకష్టాలతో జీవితం గడుపుతున్న అన్నదాతలను ఈ అకాల వర్షం నిలువునా ముంచేసింది.*

అకాల వర్షాలు అన్నదాతల పాలిట శాపాలుగా మారుతూనే ఉన్నాయి. ఈనెల 9వ తేది మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల పాటు కురిసిన ఈ అకాల వర్షంతో అనేకచోట్ల పెద్దపెద్ద చెట్లు నేలకొరిగాయి. పిడుగుపాటుకు గురై చెన్నూరులో ముగ్గురు గొర్రెల కాపరులు మృతిచెందారు. అల్లూరు మండలం గోగులపల్లి గ్రామంలో పొలాల్లో పశువులను మేపుకుంటున్న ఒక వృద్ధునిపై పిడుగుపడడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బోగోలు మండలంలోని బీజివి కండ్రిగకు చెందిన మరో వృద్ధుడు, నాయుడుపేట మండలంలోని పూడేరు గ్రామానికి చెందిన ఒక యువకుడు, గొట్టిప్రోలు ప్రాంతంలో మరో వృద్ధుడు పొలాల్లో ఉండగా తమ పక్కనే పిడుగులు పడడంతో పిడుగుపాట్లకు గురై మరణించారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలో ఇంట్లో అన్నం తింటున్న ఒక వ్యక్తి పెద్దగా ఉరుములు వస్తుండగా అలాగే కుప్పకూలిపోయి మరణించాడు.

### అందరికీ కడగండ్లు

ఈ మాయదారి అకాల వర్షంతో జిల్లా రైతాంగం అపార నష్టానికి గురైంది. కోతకు వచ్చిన వరి నేలవాలింది. కల్లాల్లో ఉన్న ధాన్యమంతా నీట మునిగిపోయింది. వేలాది బస్తాల ధాన్యం నీటిపాలు కావడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతు



న్నారు. తోటల రైతులు కూడా బాగా దెబ్బ తిన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా ఉన్న అరటితోటలు ఈదురుగాలుల దెబ్బకు సర్వనాశనం అయ్యాయి. అరటిచెట్లన్నీ సగానికి విరిగిపోయాయి. బొప్పాయి, నిమ్మతోటల్లోని కాయలన్నీ రాలిపోయి నేలపాలయ్యాయి. పలు మండలాల్లోని పెసర, వేరుశనగ, నువ్వులు, పుచ్చపంటలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల ఈదురుగాలుల ధాటికి విద్యుత్ స్తంభాలు కూడా వంగిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్‌కు బాగా అంతరాయం ఏర్పడింది. అధికారులు వెంటనే స్పందించి ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.

### 42.58 లక్షల పంట నష్టం

జిల్లాలో అకాలవర్షాలకు గురై నష్టపోయిన పంటల వివరాలను జిల్లా అధికారయంత్రాగం అంచనాలు కట్టింది. పంట నష్టం సుమారు 42.58 లక్షల రూపాయల దాకా ఉంటుందని వ్యవసాయ శాఖ ఏడిఏ నర్సోజిరావు ఈనెల 13న తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ, రెవిన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో నష్టం అంచనాలను లెక్కగట్టారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో సుమారు 131.3 హెక్టార్లలో వరి, 222.25 హెక్టార్లలో వేరుశనగ, 9.5 హెక్టార్లలో నువ్వుల పంట దెబ్బతిని ఉంటుందని అంచనా వేశారు. ఇంకా, పత్తి పంట, ఆకుతోటలు, పండ్ల తోటలు, బొప్పాయి, అరటి తోటలు, నిమ్మతోటల్లో జరిగిన నష్టాన్ని ఉద్యానశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. నష్టాలపాలైన రైతులను ఆదుకునేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించడంతో జిల్లా అధికారయంత్రాగం తగు చర్యలు తీసుకుంటోంది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకువస్తే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వాటిని కొనుగోలు చేస్తామని అధికారులు రైతులకు భరోసా ఇస్తున్నారు. అకాల వర్షాలకు నష్టాలపాలైన రైతాంగాన్ని ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని చెప్తున్నారు. నష్టాల అంచనాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను రూపొందిస్తున్నారు.

# తాళం తీసేదే లేదు

(మొదటి పేజీ తరువాయి)

21రోజుల పాటూ దేశమంతా స్థంభించిపోయింది. అన్ని రంగాలలో కార్యకలాపాలు ఆగిపోయాయి. ఒక వైద్య, పోలీసు, పారిశుద్ధ్య, రెవెన్యూ, విద్యుత్ విభాగాలే 24 గంటలూ పనిచేస్తున్నాయి. అయితే 21రోజుల లాక్‌డౌన్‌తో కరోనాపై మన దేశం పూర్తిగా విజయం సాధించలేకపోయింది. విదేశాలతో పోలిస్తే మన దేశంలో కరోనా పాజిటివ్ కేసులు తక్కువగానే నమోదైనప్పటికీ, అంచనాలకు మించి వైరస్ విస్తరిస్తుండడం ఆందోళన కలిగించే పరిణామమే! కాబట్టే వైరస్‌పై పూర్తిగా కంట్రోల్ వచ్చేదాకా లాక్‌డౌన్ కొనసాగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

### మోడీ మాటే మంత్రం

కరోనా వైరస్ పోరులో 130 కోట్ల భారతావనికి ప్రధాని నరేంద్ర మోడీ మాటే మంత్రంగా మారుతోంది. ఇన్ని కోట్ల జనాభాను ఇళ్లలో వుండేలా చేయగలిగింది. క్రమశిక్షణ పాటించేలా చేయగలిగింది మోడీ మాటల మంత్రాలే! ఆయన చెప్పిన మాటలను ప్రజలు అక్షరాలా పాటిస్తున్నారు. మోడీ లాక్‌డౌన్‌కు పిలుపునిచ్చి ఇళ్లల్లో వుండమని చెప్పినా, చప్పట్లు కొట్టి వైద్య, పోలీసు, పారిశుద్ధ్య సిబ్బందిని అభినందించండని చెప్పినా, దీపాలు వెలిగించి జాతి సమైక్యతను చాటాలని సూచించినా ప్రజలు పొల్లుపోకుండా పాటించారు.

### మే 3 వరకు లాక్‌డౌన్

మొదటి విడత లాక్‌డౌన్ ముగిసే 14వ తేదీ ఉదయం 10గంటలకు ప్రధాని నరేంద్ర మోడీ మళ్ళీ టీవీ ముందుకు వచ్చారు. కోట్లాది మంది ప్రజలు ఆ టైంకు టీవీల ముందు కూర్చుని మోడీ ఏం చెప్పబోతున్నాడా అని ఆసక్తిగా చూడసాగారు. 21రోజుల లాక్‌డౌన్‌ను విజయవంతంగా ముగించిన దేశ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు చెబుతూనే, మే 3వ తేదీ దాకా లాక్‌డౌన్‌ను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జాతినుద్దేశించి మోడీ చేసిన ప్రసంగం ప్రజలను రెండో ఇన్నింగ్స్ లాక్‌డౌన్‌కు కార్యోన్ముఖులను చేసింది. మోడీ ప్రకటనపై ఎలాంటి వ్యతిరేకత లేదు. ప్రజల ఆరోగ్య భద్రతపై ప్రధానిగా మోడీ చూపిస్తున్న శ్రద్ధకు ప్రజలు కూడా ఫిదా అవుతూ మే3 దాకా ఇళ్లకే పరిమితం కావడానికి సిద్ధపడ్డారు.

### అందరితో చర్చించాకే...

లాక్‌డౌన్‌ను పొడిగించాలన్న నిర్ణయాన్ని ప్రధానిగా మోడీ సొంతంగా తీసుకోలేదు. దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఆయన చర్చించారు. దానికిముందే పార్లమెంటరీ ప్రతిపక్షాల నాయకుల అభిప్రాయాలూ తీసుకున్నారు. వివిధ పార్టీల అధినేతల సూచనలు స్వీకరించారు.

ప్రస్తుతం కరోనాపై పోరు కీలక దశలో వుంది. ఏ మాత్రం లాక్‌డౌన్ ఎత్తేసినా వైరస్‌ను అదుపు చేయడం కష్టమవుతుంది. ఇప్పటిదాకా చేసిన శ్రమంతా కూడా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. దీనికి తోడు మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు, రాజస్థాన్, యూపీలలో కరోనా పాజిటివ్ కేసుల ఉధృతి ఎక్కువైంది. ఈ పర్యవసానాల నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ పొడిగింపువైపే మొగ్గుచూపింది.

### మర్కజ్ లేకుంటే...

ఢిల్లీ జమాత్ మర్కజ్ ఘటన లేకపోయి వుంటే మొదటి విడత లాక్‌డౌన్‌తోనే కరోనా వైరస్‌పై మనకు కంట్రోల్ వుండేది. ఈ వైరస్ చాలా కొద్ది ప్రాంతాలకే పరిమితమై వుండేది. కాని మర్కజ్ వల్ల దేశం నలుమూలలా గ్రామీణ ప్రాంతాలకు వైరస్ సోకడంతో పరిస్థితి ప్రమాదంలో పడింది. లాక్‌డౌన్‌ను పొడిగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### సడలింపులుంటాయా?

ఈ నెల 20 తర్వాత కొన్ని సడలింపులుంటాయని మోడీ ప్రకటించి వున్నారు. ముఖ్యంగా వ్యవసాయ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక రంగాలకు, వైద్య, ఆరోగ్య పరమైన ఉత్పత్తుల రంగాలకు కొన్ని సడలింపులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

కరోనాపై సాగుతున్న సమరంలో ఒక అంకం దాటి రెండో భాగంలోకి దేశం అడుగుపెట్టింది. అమెరికా, చైనా, ఫ్రాన్స్, ఇటలీ, బ్రిటన్, జర్మనీ వంటి దేశాలు కూడా కరోనాపై సుదీర్ఘ పోరాటానికి సిద్ధపడ్డాయి. ఈ దేశాలలో కరోనా వైరస్‌ను ఇతరులకు అంటించాలనే ఉన్మాదులు లేరు, కేవలం వైరస్‌తోనే ఆ దేశాలు పోరాడుతున్నాయి. భారతదేశం మాత్రం కరోనా వైరస్‌తో పాటు, ఈ వైరస్‌ను జనాలకు అంటించి దేశాన్ని అల్లకల్లోలం చేయాలనే మరికొందరు ఉన్మాదులతోనూ పోరాడుతోంది. కాబట్టి ఈ పోరాటంలో గెలుపు సాధించాలంటే తీవ్రంగా శ్రమించాల్సి వుంటుంది.

# పెరిగేనా? ఆగేనా?

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీ మర్కజ్ సంబంధిత కేసులు లేకపోయి వుంటే ఏపిలో నమోదైన ఇతర కరోనా పాజిటివ్ కేసులు చాలా తక్కువ. ఏపిలో నమోదైన కేసుల్లో 90శాతంకు పైగా కేసులు ఢిల్లీ నిజాముద్దీన్ మర్కజ్‌తో లింకున్నవే! రాష్ట్ర వ్యాప్తంగా 16వ తేదీ ఉదయం వరకు 534 కేసులు నమోదయ్యాయి. కరోనా కేసుల్లో గుంటూరు జిల్లా ఒక్కసారిగా దూసుకుపోయింది. ఆ తర్వాత కర్నూలు, నెల్లూరుజిల్లాలలో కేసులు ఎక్కువుగా వున్నాయి. ఈ కేసులు చాలావరకు మర్కజ్ సదస్సుతో సంబంధాలున్నవే!

### నిరంతర యుద్ధం

కరోనా వైరస్ కేసులను అదుపులోకి తేవడానికి రాష్ట్ర అధికార యంత్రాంగం నిరంతరం యుద్ధం చేస్తూనే వుంది. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అధికార యంత్రాంగాన్నంతా అప్రమత్తం చేసి, కరోనా వైరస్‌పై పోరులో ముందుకు సాగుతున్నారు. రాష్ట్రంలో ఐసోలేషన్ బెడ్‌లను, కోవిడ్ ఆసుపత్రులను, వెంటిలేటర్లను పెంచారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ప్రజలందరికీ ఒక్కొక్కరికి మూడు లెక్కన 16కోట్ల మాస్క్‌లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇంకే రాష్ట్రంలో కూడా ఇలాంటి కార్యక్రమం లేదు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా మూడో విడత సర్వే కూడా పూర్తి చేయిస్తున్నారు. కరోనా వైరస్ రోగుల కోసం జల్లెడ పట్టి గాలిస్తున్నారు. కరోనాపై యుద్ధంలో ఏపి ప్రభుత్వ పనితీరు ఎంతో సమర్ధవంతంగా వుంది.

# స్పందించిన "రత్నం" మాష్టారు



ఎప్పుడు ఎక్కడ ఏ ప్రకృతి వైపరీత్యం జరిగినా నేనున్నానంటూ స్పందించే కె.వి.రత్నం మాష్టారు ఈసారి కూడా తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ నెల 11వ తేదీన సర్వేపల్లి శాసనసభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ద్వారా రూ. 2లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు.

# పరిమళిస్తున్న సింహపురి దాతృత్వం






కర్కశ కరోనా ప్రపంచాన్ని వణికిస్తున్న సమయంలో, ఆపదలో ఆదుకోవడానికి మేమున్నాం అంటూ ఎంతోమంది దాతలు సహృదయంతో ముందుకొచ్చి తమ దాన గుణాన్ని చాటుకుంటున్నారు. ఈ క్రమంలో ఇటీవల వెలగపూడిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి కోటి రూపాయల చొప్పున చెక్కులను అందజేస్తున్న రైన్‌బో చిన్నపిల్లల ఆసుపత్రి ఛైర్మెన్ డాక్టర్ కంచర్ల రమేష్, మెడికవర్ హాస్పిటల్స్ ఛైర్మెన్ డా॥ గుండాల అనిల్‌కృష్ణారెడ్డి. వీళ్ళిద్దరూ నెల్లూరీయులే, ఇద్దరిదీ నెల్లూరుజిల్లా ఆత్మకూరు ప్రాంతమే! డా॥ అనిల్‌కృష్ణది ఆత్మకూరు స్వగ్రామం కాగా, రమేష్‌ది ఆత్మకూరు సమీపంలోని చిరమన. ఇద్దరూ డాక్టర్లు కావడం ఒక విశేషమైతే, వీళ్ళిద్దరికీ గురువు రత్నం మాష్టారే కావడం మరో విశేషం!

## సడలింపులతో...

# కొంత ఊపిరి పీల్చుకోవచ్చు

మే 3వతేదీ వరకు దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ పొడిగించిన కేంద్ర ప్రభుత్వం, ఈనెల 20వ తేదీ నుండి కొన్ని రంగాలకు మినహాయింపులను ఇవ్వడం ప్రజలకు ఊరట కలిగిస్తుంది. కరోనా వైరస్‌పై పూర్తిగా కంట్రోల్ రానప్పటికీ లాక్‌డౌన్‌ను కొనసాగిస్తే మాత్రం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమల్లో ఉంది. అయితే దేశంలోని అన్ని ప్రాంతాలలో వైరస్ తీవ్రత ఒకేలా లేదు, కొన్ని రాష్ట్రాలలో అతి తీవ్రంగానూ, కొన్ని రాష్ట్రాలలో తీవ్రంగానూ, మరికొన్ని రాష్ట్రాలలో తక్కువగాను ఉంది. కాబట్టి అన్ని రాష్ట్రాలను కూడా ఒకే గాటన కట్టేసి, అన్ని చోట్ల ప్రజా జీవనాన్ని, ఆర్థిక లావాదేవీలను, వర్తక వాణిజ్యాలను నిలిపేయాల్సిన అవసరం లేదు. వైరస్ తీవ్రత చాలా తక్కువ ఉన్న రాష్ట్రాలలో ప్రజా రవాణా, సినిమా థియేటర్లు, మాల్స్ వంటి ప్రజా సమూహాలు ఏర్పడే కార్యకలాపాలను రద్దు చేసి, మిగతా అన్ని లావాదేవీలు కూడా కొనసా గించవచ్చు. లాక్‌డౌన్ పొడిగించే ప్రకటన చేయడానికి ముందు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వివిధ రాష్ట్రాల ముఖ్య మంత్రుల అభిప్రాయాలు తీసుకోవడం తెలిసిందే! ఈ సందర్భంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా జోన్ల వారీగా లాక్‌డౌన్‌ను తొలగిం చాలని సూచించడం జరిగింది. రేపు 20వతేదీ తర్వాత ఇలా సడలింపులు ఉండ బోతున్నాయి. రెడ్‌జోన్‌గా ప్రకటించిన జిల్లాలలో లాక్‌డౌన్ యథావిధిగా కొనసాగనుంది. గ్రీన్ జోన్లలో కార్యకలాపాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, చిన్నచిన్న వ్యాపార సంస్థలు, రవాణా, బ్యాంకులు, తక్కువ సిబ్బందితో ప్రైవేటు కార్యాలయాలు కొనసాగించుకోవచ్చు. వృత్తి కార్మికులు తమ కార్యకలాపాలను మొదలు పెట్టవచ్చు. నిర్మాణ పనులు కూడా ప్రారం భించడానికి అవకాశం ఉంది. వ్యవ సాయం, వస్తు రవాణా, చిన్న చిన్న పరి శ్రమలు ప్రారంభమైతే ముందు కూలీలకు పని దొరుకుతుంది. పస్తులుండే అవసరం లేకుండా పోతుంది



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com